జగన్మాత

శ్రీ అరవిందులు

అనువాదకులు

స్వామి శుద్ధానంద భారతి

చింతా దీక్షితులు

సూచిక

1. ఈశ్వరకృప

మన ప్రయత్నములకు లక్ష్యమైన, కష్టసాధ్యమగు పరమార్థము రెండు శక్తుల సమావేశము వల్లనే లభ్యమగుచున్నది. ఇహము నుండి పిలిచే దృఢమైన, అమోఘమైన ఆకాంక్ష ఒకశక్తి, పరము నుండి అనుగ్రహించే పరమ కృప రెండో శక్తి.

కాని సత్యజ్ఞానముల నియమములందు మాత్రమే 'పరమకృప' ప్రవర్తిస్తుంది; అసత్యాజ్ఞానములు దానిపై విధించు నియమములందు, అది ప్రవర్తించదు. ఎందువల్లనంటే, అసత్యమునకు అది లొంగినట్లయితే, స్వకార్య వ్యాఘాతము సంభవిస్తుంది.

సత్యజ్ఞానముల నియమములు ఇవి. వీటివల్లనే "పరాశక్తి'అవతరించేది. 'పరమ విజ్ఞానశక్తి' మాత్రమే పైనుంచి దిగిన్నీ, క్రింది నుంచి వికసించిన్నీ, స్థూల ప్రకృతిని జయప్రదముగా వశము చేసుకొని దాని దోషములను పరిహరిస్తున్నది...

నిష్కపటమైన, సంపూర్ణమైన, ఆత్మార్పణము ఉండవలెను. ఈశ్వర శక్తిని పొందడానికి ప్రత్యేకముగా తన్నుతాను వికసింపచేసుకోవలెను; పైనుండి అవతరించే సత్యమును సర్వదా సంపూర్ణముగా గ్రహించుచుండవలెను. ఐహిక ప్రకృతిపై ఇంకను అధిపత్యమువహించి యుండు మనస్సు, ప్రాణము, దేహము - వీటికి సంబంధించిన శక్తుల యొక్కయు రూపముల యొక్కయు అసత్యమును సర్వదా సంపూర్ణముగా నిరాకరించవలెను.

ఆత్మార్పణము సంపూర్ణముగా నుండవలెను. అదిపురుషుని ప్రతి భాగమును వశపరచుకోవలెయును. చైత్యపురుషుడు (Psychic) తల యూపినంత మాత్రమున చాలదు: పరాబుద్ధిమయ పురుషుడు (Higher Mental) సమ్మతించినంత

మాత్రమున చాలదు. [1] ప్రాణమయ చైత్య పురుషుడు.(Inner Vital) లో బడినంత మాత్రమున చాలదు. అన్నమయచైత్య పురుషుడు (Inner Physical Consciousness) తెలుసుకొన్నంత మాత్రమున చాలదు. పురుషుని ఏ భాగమందూ అతిబహిరంగ భాగమందు సైతము - మినహాయించుకొనేదేదిన్నీ ఉండ కూడదు [2]

పురుషుని యందలి కొంతభాగము అర్పితమై మరి కొంత భాగము తన్ను తాను మినహాయించుకొని, దాని మార్గాన్నే అది అనుసరిస్తూ లేదా దాని నియమములనది విధిస్తూ ఉంటే - అట్లా జరిగే ప్రతిమాటూ, ఈశ్వర కృపను నీనుండి నీవే దూరముగా త్రోసివేసుకొంటున్నావు. నీ భక్తి, నీ అర్పణమూ - వీటిమరుగులో నీవు నీ ఆశలకూ, అహంకారపూరితమగు కోరికలకూ, ప్రాణమయ కోశమునకు సంబంధించిన పట్టుదలకూ ఆశ్రయమిచ్చినట్లయితే, నిజమైన ఆకాంక్ష ఉండవలసినచోట వీటిని నీవు ఉంచినట్లయితే , లేదా దానితో వీటిని కలిపివేసి, ఈశ్వర శక్తిని, మోసగింప యత్నించినట్లయితే, నీలో మార్పుకలగడం కోసం "ఈశ్వర కృపను ' వేడుకోవడము వ్యర్థము.

సత్యమును పొందుటకు నీవు నీలో ఒకభాగముగాని, ఒక పార్శ్వమునుగాని వికసింపజేసి వేరొక భాగమును విరోధ శక్తులు ప్రవేశించడమునకు తెరిచి ఉంచితే 'ఈశ్వరకృప' నీపై స్థిరముగా నుండునని ఆశించడము వ్యర్థము. సత్యరూపమును ప్రతిష్ఠించవలెనని ఇచ్ఛ ఉంటే, ఆలయమును నీవు పరిశుద్ధముగా నుంచుకోవలెను.

---

1. మనయొక్క మనోమయ, ప్రాణమయ, అన్నమయకోశములకు లోపల సూక్ష్మముగా, చైతన్యరూపమున' లోపలిమనస్సు ' లోపలి ప్రాణము' లోపలి స్థూలము' కలవు. యోగులు మాత్రము వానిని చూడగలరు. అవే ఇచ్చట ప్రాణమయ చైత్యపురుషుడు అన్నమయ చైత్యపురుషుడు అని వివరింపబడ్డవి.

2. శంకలవెనుక భ్రమలవెనుక, మిషలవెనుక ఒదిగి ఉండే దేదిన్నీ ఉండకూడదు తిరుగుబాటు చేసేదికాని, నిరాకరించేదికాని, ఏదిన్నీ ఉండకూడదు.

ప్రతి పర్యాయమూ, (ఈశ్వరకృపా) శక్తి తాను కలుగజేసుకొని, సత్యమును తీసుకొని వస్తూ ఉండగా, నీవు దానిపై విముఖత్వము చూపి, బహిష్కరింపబడ్డ అసత్యమును నీవు పునరాహ్వానము చేస్తూఉంటే నీకు ఈశ్వరకృప కలుగలేదని నీవు దానిని నిందించరాదు - నీవు నిందించవలసినది నీ అసత్యేచ్ఛనూ, అసంపూర్ణార్పణమునూ.

నీవు సత్యము కొరకు ప్రార్థించినప్పుడు, నీలో ఏదో ఒకటి, అసత్యమైన దానిని, అజ్ఞానముతో కూడిన దానిని, దివ్యేతరమైన దానిని కోరుకొనుచున్నట్లయితేనూ, లేదా, అటువంటి దానిని పూర్తిగా నిరాకరించడానికి అనిష్టముగా ఉన్నట్లయితేనూ - విరోధశక్తులు నిన్ను వశము చేసుకొంటవి. అప్పుడు ఈశ్వరానుగ్రహము నీకు దూరమవుతుంది. మొట్టమొదట నీలో ఏది అసత్యముతోనూ అజ్ఞానముతోనూ కూడిఉన్నదో దానిని కనిపెట్టు. దానిని పట్టుదలతో నిరాకరించు, అప్పుడే నీవు నీలో మార్పు కలిగించడముకోసము ఈశ్వరశక్తిని ప్రార్థించితే సరిగా ఉంటుంది.

సత్యాసత్యములు, జ్ఞానాజ్ఞానములు, ఆత్మార్పణ స్వార్థపరత్వములు - ఇవి ఈశ్వరార్పితమైన మందిరములో అన్నియూ కలిసి నివసిస్తాయని అనుకోకు. నీలో మార్పు పూర్తిగా ఉండవలెనంటే దానిని ప్రతిఘటించే అన్ని విషయములు నీవు పూర్తిగా నిరాకరించవలను.

నీవు ఈశ్వరాజ్ఞను ఈడేర్చకపోయినప్పటికీ నీకోరిక ననుసరించి ఈశ్వరశక్తి సర్వమునూ చేస్తుందనీ, చేయ్యడానికి కట్టుబడ్డదనీ తప్పు అభిప్రాయము పెట్టుకోకు. నీ ఆత్మార్పణము యధార్థమైనదానినిగాను సంపూర్ణమైన దానినిగాను చేయి. అట్లా చేసినప్పుడే నీ మనోభీష్టములన్నీ సిద్ధిస్తవి.

నీ కొరకు ఈశ్వరశక్తే అర్పణము సైతము చేస్తుందనే పనికిమాలిన, తప్పుడుఆశకూడా పెట్టుకోకు. ఆమెకు నీవు ఆత్మార్పణం చేసుకోవలెనని ఈశ్వరాదేశము. కాని బలవంతములేదు. తిరుగులేని మార్పు నీవు పొందేవరకూ ఎప్పుడుపడితే అప్పుడు దైవములేదని నిరాకరించడమునకూ, ఆత్మార్పణాన్ని రద్దు చేసుకోవడానికీ, నీకు స్వేచ్ఛ కలదు. కాని, దానివల్ల కలిగే ఆధ్యాత్మికఫలము ననుభవించడానికి నీవుసంసిద్ధుడవై ఉండవలెను. నీఅర్పణము ఆత్మకృత్యమై, స్వేచ్ఛా పురస్సరమై ఉండవలెను. అది చైతన్యము గల పురుషుని అర్పణమై యుండవలెను గాని,

జడమున్నూ, ఎటుతిప్పిన అటుతిరుగు కీలుబొమ్మయొక్కగాని, ఉపకరణము యొక్కగాని అర్పణము వంటి అర్పణమై యుండరాదు.

శుద్ధ జడత్వమును చూచి, యధార్థార్పణమని తరచుగా భ్రమపడడం కద్దు. కాని జడత్వము నుంచి యధార్థము, శక్తిమంతము అయిన దెట్టిదిన్నీ లభించదు. శుద్ధ జడత్వమే స్థూలప్రకృతిని ప్రతీ ఆసురికతమోవృత్తిపాలూ చేస్తున్నది. సంతోషపూర్వకమున్నూ, దృఢమున్నూ, అనుకూలమున్నూ అయిన విధేయత ఈశ్వరకార్యమునకు అవసరము. సత్యమునకు శుశ్రూషచేయు జ్ఞానికుండే విధేయతవంటి విధేయత, అజ్ఞానాసత్యములపై కత్తిదూయు 'లోపవియోధుని' కుండే విధేయతవంటి విధేయత, శ్రద్ధాళువగుభగత్కింకరునికుండే విధేయతవంటి విధేయత.

ఇదియే సరియైన భావము. ఇటువంటి భావము కలవారే ఆశాభంగముల వల్లగాని, కష్టములవల్లగాని చలించని శ్రద్ధగలవారై కఠినమైనశోధనలదాటి ఉత్కృష్టమైన విజయమున్నూ, మహత్తరమైన పరివర్తనమున్నూ పొందగలరు.

2. సాధకుని ప్రయత్నము

ప్రపంచములో జరిగే ప్రతికార్యమూ ఈశ్వరుడు తన 'శక్తి ' ద్వారా నడిపిస్తున్నాడు. కాని అతడు తన యోగమాయచే మరుగుపడి జీవుని అహంకారము ద్వారా నీచ ప్రకృతిలో పనిచేస్తున్నాడు.

యోగములో కూడా సాధకుడూ సాధనా ఈశ్వరుడే; ఈశ్వరుని శక్తే 'అధారము' (అన్నము, ప్రాణము, మనస్సు, విజ్ఞానము, ఆనందము అని ఆధారములైదు). పైని పనిచేస్తూ అది (ఆధారము) వికసితముకాగానే తేజస్సు, సత్త్వము, జ్ఞానము, చైతన్యము, ఆనందము అనే ఆమె (ఈశ్వరశక్తి) యొక్క దివ్యశక్తులతో ఆధారములోనికి ప్రవహించి సాధన సాధ్యమమ్యేటట్లు చేస్తున్నది. కాని నీచప్రకృతి చురుకుగా ఉన్నంతవరకు సాధకుని పురుష ప్రయత్నము అగత్యము.

ఇట్టి పురుష ప్రయత్నము మూడు విధములగు పరిశ్రమలతో కూడుకొని ఉన్నది. 1. ఆకాంక్ష 2. నిరాకరణము 3. అర్పణము.

I. ఆకాంక్ష:

ఆకాంక్ష మెలకువతో గూడినదై స్థిరమై ఎడతెగకుండా ఉండవలెను. మనోమయ పురుషుని ఇచ్ఛ, హృదయాన్వేషణము, ప్రాణమయపురుషుని ఆమోదము, అన్నమయ పురుషుని చైతన్యమునూ, స్వభావమునూ వికసింపజేసి మృదువుగా చెయ్యవలెననే ఇచ్ఛ-ఇది ఆకాంక్ష.

2.నిరాకరణము:

నీచ ప్రకృతియొక్క వ్యాపారములను నిరాకరించడము-అనగా మనోమయ పురుషుని భావములు, ఆలోచనములు, ఇష్టానిష్టములు, అలవాట్లు, అభిప్రాయములు వీటిని నిరాకరించవలెను. అప్పుడు ప్రశాంతమగు మనోమయ కోశమున యథార్థమగు అజ్ఞానము స్వేచ్ఛగా కాపురముండును.

ప్రాణమయపురుషుని ప్రకృతికి సంబంధించిన ఆశలు, దృఢవాంఛలు, తృష్ణలు, విషయసంయోగములు, రాగద్వేషములు, , స్వార్థపరతత్వము, గర్వము, దురహంకారము, కామము, లోభము, మత్సరము, అసూయ, సత్యముపై విరోధభావము - వీటిని నిరాకరించవలెను. అప్పుడు శాంతము, విశాలము, దృఢము, పవిత్రము అగు ప్రాణమయకోశములోనికి నిజమైన శక్తిన్ని, ఆనందమున్నూ పైనుండి ప్రవహించును.

అన్నమయ పురుషుని ప్రకృతికి సంబంధించిన మాంద్యము సంశయము, అపనమ్మకము, అజ్ఞానము, మొండితనము, అల్పత్వము, సోమరితనము, మార్పు అంటే యిష్టములేకపోవుట, తామసము వీటిని నిరాకరించవలెను. అప్పుడు నిరంతరము దివ్యభావమును పొందుచున్న అన్నమయకోశము నందు జ్ఞానము, శక్తి, ఆనందముల యొక్క స్థిరత్వము ఏర్పడవచ్చును.

3. అర్పణము:

తన్నూ, తానైన సర్వమున్నూ, తనకున్న సర్వమున్నూ, తన చైతన్య భూమ్ములన్నింటినీ తన వ్యాపారముల నన్నింటినీ ఈశ్వరునికిన్నీ శక్తికిన్నీ అర్పించవలెను.

ఆత్మార్పణమున్నూ, ఆత్మ నివేదనమున్నూ అధికమైన కొద్దీ, దివ్య స్వభావముయొక్క స్వేచ్ఛనూ సంపూర్ణత్వమునూ అతనిలో ఈశ్వరశక్తి స్థాపించును. అంతకంతకు హెచ్చుగా ఈశ్వర శక్తి ప్రవహిస్తూ ఉండడము వలన తనలో ఈశక్తి సాధనచేస్తూ ఉన్నట్లు సాధకుడు గుర్తించును. స్వప్రయత్నమునకు బదులుగా ఇట్టి కార్యము ఎంత జరుగుతూ ఉంటే అంత త్వరగాను, నిశ్చయముగాను అతడు వృద్ధి జెందును. కాని ఆత్మార్పణము, ఆత్మనివేదనమూ, ఆమూలాగ్రముగా పరిశుద్ధమున్నూ సంపూర్ణమున్నూ అయ్యేవరకూ పురుష ప్రయత్నము అవశ్యము. దీనికి బదులది పూర్తిగా పనిచెయ్యలేదు.

ఆజ్ఞలను నెరవేర్చక తిరస్కరించి తనకేమీ శ్రమా కష్టమూలేకుండా సర్వమూ భగవంతుణ్ణే చేయుమని కోరుతూ ఉండే తామసికార్పణము ఆత్మవంచన అగును. దానివల్ల సంపూర్ణత్వమూ సిద్ధీ కలుగవని గ్రహించుకో.

3. జగన్మాత అనుగ్రహాము

భయమున్ను, ఆపదయున్ను, విపత్తులున్ను నిన్నంటకుండా జీవితయాత్ర జరుపవలెనంటే, రెండు వస్తువులే అవపరము. ఈ రెండూ యెప్పుడూ కలిసి ఉంటవి. అవి ఏవంటే జగన్మాత అనుగ్రహం ఒకటి; శ్రద్ధతోను, సద్భావముతోను సమర్పణతోను కూడుకొన్న నీ అంతర్గతస్థితి రెండు. నీ శ్రద్ధ పరిశుద్ధముగను, నిష్కపటముగను, దోషరహితముగ నుంచుకో. అత్యాశ, గర్వము, దంభము, మనస్సుకు సంబంధించిన దురహంకారము, ప్రాణమయకోశమునకు సంబంధించిన మూర్ఖత, స్వార్థమైన కోరిక, నీచప్రకృతి అల్పసంతుష్టికోసమైన వాంఛలు - వీటిచేత కలుషితమై మనస్సునందూ, ప్రాణమునందూగల అహంకార పూరితమగు శ్రద్ధ - పొగచే మూయబడి చిన్నదై, దివికెగసి ప్రజ్వలింప లేని జ్వాలవంటిది. ప్రత్యేకముగా, భగవంతుని కార్యముకొరకున్ను, భగవల్లీలలందు తోడ్పడుటకున్ను నీ జీవితము ప్రసాదింపబడినట్లు నీ వూహించుకో, ద్వివైతన్యము యొక్క పారిశుద్ధ్యము, శక్తి, తేజస్సు, వ్యాపకత్వము,ప్రశాంతత, ఆనందమున్ను తప్ప యింక దేనినీ కోరకు, నీమనస్సును, ప్రాణమును, దేహమును, పట్టుదలతో అదిమార్చి పరిపూర్ణస్థితికి తేవలెననే కోరికతప్ప యింక దేనిమీద కోరిక పెట్టుకోవద్దు. దివ్యమున్ను ఆధ్యాత్మికమున్ను, విజ్ఞానమున్ను అగుసత్యము తప్ప యింక దేనిని కోరకు. ఇహలోకమందును, నీలోను, అనుగ్రహపాత్రులైనవారిలోనున్ను, ఆ సత్యము, అనుభవసిద్ధము కావలెననే తప్ప యింక దేనినీ కోరకు. ఆ సత్యమును కలిగించుటకున్నూ, విరోధశక్తుల నన్నింటిని అది జయించునట్లు చేయుటకున్నూ, వలయు పరిస్థితులను తప్ప యింకదేనినీ కోరకు.

నీ సద్భావమున్ను, సమర్పణమున్ను నికరముగాను, సమగ్రముగాను ఉండేటట్లు చూడు. నిన్ను నీ వర్పించుకొనేటప్పుడు, పూర్తిగానే అర్పించుకో. కోర్కెలు, షరతులు, మినహాయింపులు పెట్టుకోకు. అప్పుడు నీసర్వము జగన్మాత వశమగును. నీ అహంకారమునకుగాని, మరి ఏ యితర శత్రులకుగాని ఏమీ మిగలదు.

నీ శ్రద్ధ, సద్భావము, ఆత్మార్పణము యెంత సంపూర్ణముగా ఉంటే అంత యెక్కువగా అనుగ్రహమూ, రక్షా నిన్నంటి యుంటవి. జగన్మాత అనుగ్రహమూ, రక్షా నిన్నంటియున్నప్పుడు, నిన్ను తాకగలదేది అయినా కలదా? నీవుచూచి భయపడ దగ్గవారెవరైనా ఉంటారా అనుగ్రహము స్వల్పమాత్రమైననూ కష్టములనుంచి, విఘ్నమునుంచి, విపత్తులనుంచి నిన్ను దరిజేర్చును. ఆమె సంపూర్ణానుగ్రహమే నీపైని ఉంటే నీవు నీ మార్గము ననుసరించి భద్రముగా పోవచ్చును. అది జగన్మాత మార్గము కాబట్టి, ఎట్టి బెదిరింపులను లక్ష్యపెట్టవలసిన అవసరములేదు. ఈలోకము నుంచిగాని, అగోచరములగు లోకములనుంచి గాని, ఎంతటి ప్రబల శత్రుత్వము కల్గినను నీవు చలించ వలసిన అక్కరలేదు. తదీయానుగ్రహ స్పర్శవల్ల కష్టములు లాభకరమగు తరుణములుగాను, అపజయము జయముగాను, దుర్బలత్వము అప్రతిహతమగు బలముగాను మారును. ఎందువల్లనంటే, ఈశ్వరుని అనుజ్ఞయే జగన్మాత అనుగ్రహయము. నేడో, రేపో దాని ఫలమది యిచ్చి తీరుతుంది. అది నిశ్చయము. అనివార్యము.

4. ధనతత్త్వము

ధనము ఒక విశ్వశక్తి యొక్క ప్రత్యక్ష చిహ్నము. భూలోకమున ఈ శక్తి వ్యక్తమై (మానవుని) అన్నమయ ప్రాణమయకోశముల మీద పనిచేస్తున్నది. బాహ్యజీవితము యొక్క పరిపూర్ణత్వమునకది తప్పనిసరిగా ఉంటున్నది. దాని ఉత్పత్తి ఈశ్వరునియందే. దాని నిజమైన వ్యాపారమున్నూ ఈశ్వరునియందే. కాని యితరమైన ఈశ్వరశక్తుల వలెనే అది యిక్కడ పనిచేయుటకు నియమింపబడినది. కాని నీచప్రకృతి వల్ల కలిగిన అజ్ఞానము కారణముగా అహంకార ప్రయోజనములకై అది దుర్వినియోగము కావచ్చును; లేదా ఆసురిక శక్తుల చేజిక్కి, వాటి కార్యముల కొరకది దుర్వినియోగము కావచ్చును. మానవుని అహంభావమునున్ను అసురుణ్ణీన్నీ బలీయముగా ఆకర్షించే 1. అధికారము, 2. ధనము, 3. కామము అనే మూడు శక్తులలో ఇది (సొమ్ము) ఒక్కటి. సర్వ సాధారణముగా ఇవి కలవారు వాటిని సరిగా గ్రహించి వినియోగపరచడములేదు. ధనాన్వేషణ తత్పరులున్ను, ధనమును కూడబెట్టేవారున్నూ సాధారణముగా ధనమునకు తాము స్వాధీనులగుతున్నారు, గాని వారి స్వాధీనములో ధనముండడములేదు. చాలకాలంపాటు అసురగ్రస్తమగుటచే ఈ ధనము సన్మార్గచ్యుతమైనది. కుటిల మార్గములకు త్రిప్పే యిట్టి ధనము యొక్క దుష్ట ప్రభావము నుండి బహుకొద్ది మంది మాత్రమే తప్పించుకోగలరు. ఇందుకనే సంపూర్ణమైన ఆత్మ నిగ్రహమున్నూ, సర్వసంగ పరిత్యాగమున్నూ ధనపాశముల నుండి విముక్తిన్ని, ధనమును పొందవలెననే అహంకారపూరితమైన ఇచ్ఛను వదలి పెట్టడమున్నూ, అత్యవసరమని ఆధ్యాత్మ శిక్షలు పెక్కులు నియమిస్తున్నవి. కొందరు ధనభాగ్యములను సయితము నిషేధించి ఆధ్యాత్మసాధనకు కేవలము దారిద్ర్య నిరాడంబర జీవనములే మార్గములని చాటుచున్నారు. కాని ఇది పొరపాటు; ఎందువల్లనంటే విరోధశక్తులు ఇందువల్ల బలీయమగును. ఈశ్వరుని ధనము ఈశ్వరుని కోసము తిరిగి జయించి, దానిని ఈశ్వరార్పణముగా ఆధ్యాత్మిక జీవనము కొరకు వినియోగించడము సాధకుని పరమ విజ్ఞానమార్గము.

ధనశక్తి నుంచి, అది యిచ్చే సాధనములనుంచి, దానివల్ల కలుగు భోగ్య వస్తువుల నుంచి విరాగివలె విముఖుడవు కానూ కూడదు. వాటి యెడల రాజసికమగు రాగమును పెట్టుకోనూకూడదు. వాటి సంతుష్టికై బానిసత్వము నాపాదించు ఆత్మ లోలత్వమున తగుల్కోనూకూడదు. జగన్మాత కొరకై తిరిగి జయించి ఆమె సేవకొరకే వినియోగింపవలసిన శక్తి అని మాత్రమే ధనమును గణించు.

ధనమంతా ఈశ్వరునిదే. ధనము గలవారు దానిని పాలించు ధర్మకర్తలే గాని యజమానులుగారు. నేడది వారిదగ్గర ఉంటుంది. రేపది యింకోచోట ఉండవచ్చు. ధనమున్నప్పుడు వారు దానిని ఏ భావముతో ఎందుకొరకు, ఎట్టి చిత్తవృత్తితో పాలిస్తున్నారు అనే విషయమే ప్రధానం.

నీవు నీ కోసమని ధనము వినియోగించవలసి వచ్చినప్పుడు నీకు వచ్చినదీ, నీవు తెచ్చుకొన్నదీ, అయిన ధనమంతా జగన్మాతదే అని భావించుకో. ఆమె నేమీ కోరకు. ఆమె వద్ద నుండి నీకు వచ్చినదెల్లా స్వీకరించు. ఎందుకొరకైతే అది నీకు యివ్వబడ్డదో అందుకే దానిని వినియోగించు. పూర్తిగా స్వార్థరహితుడవై ఉండు. చాల న్యాయముగా ఉండు. తూ.చా. తప్పకుండా సూక్ష్మవిషయములందు సయితము జాగ్రత్తగా ఉండు. మంచి ధర్మకర్తవుగా ఉండు. నీవు వినియోగిస్తూ ఉన్న ధనము నీది కాదని ఆమె ఆస్తియే అని యెప్పుడూ తలంచు. అంతే కాకుండా, ఆమె కోసమని నీవు స్వీకరించినదంతా ఆమె సన్నిధానాన్నే భక్తి శ్రద్ధలతో ఉంచు; అందులో ఏమిన్నీ నీకోసం గాని ఎవ్వరి కోసముగాని ఉపయోగించకు.

ధనమున్నది గదా యని, భాగ్యవంతుల సాహాయ్యము అపేక్షించకు; వారి పటాటోపము, అధికారము, పలుకుబడిచూచి భ్రమపడకు. జగన్మాత కోసమని నీవు ఎవరినైనా ఏమైనా అడిగేటప్పుడు ఆమెయే నీద్వారా ఆమె సొత్తులో స్వల్పభాగము కోరుతున్నట్లు నీవు అనుకోవలెను. నీవు యెవరినైతే అడుగుతున్నావో అతడు యిచ్చే సమాధానమును బట్టి అతని యోగ్యతాయోగ్యతలు నిర్ణయించబడుతవి.

విరాగివలె ధనవిముఖత్వము చెందకుండా ధనము వాడుతూ ఉన్న నీకు ధనకళంకము అంటనినాడు ఈశ్వర కార్యమునకై ధనమును వినియోగించుటకు నీకెక్కువ సామర్థ్యము కల్గును. సమత్వభావమున్నూ, వాంఛా రాహిత్యమున్నూ, ఈశ్వర శక్తికీ ఆమె కార్యములకు నీ ఆస్తి, నీ గడన, నీ ఆర్జన శక్తి సంపూర్ణముగా

అర్పించడమున్ను-ధనకళంకము నిన్నంట లేదనుటకు చిహ్నములు. ధనము తద్వినియోగముల గూర్చి మనస్సంచలనమేమైనా కలిగితే అవి నీలోని కొంత లోపమునకో బంధమునకో సరియైన గుర్తు అగును.

ఇటువంటి ఆదర్శప్రాయుడైన సాధకుడెవడంటే - దరిద్రుడై జీవించమంటే అలాగే జీవించగలడు. ఆతనికి లోటు ఉన్నదని ఎప్పుడూ అనుకోడు. ఈశ్వర చైతన్యమాతనిలో ప్రవేశించి పని చేయడమునకు ఏమీ అభ్యంతరము ఉండదు. భాగ్యవంతుడుగా జీవించమంటే - అట్లాగా జీవించగలడు. అతడు ఒక్క క్షణమైన ఆశాపీడితుడు గాడు. తన ధనము మీద గాని తానుపయోగించు వస్తువుల మీద గాని మమకారము పెట్టుకోడు. ఆత్మభోగపరాయణత్వమునకు బానిస కాడు. ధనమువల్ల కలిగే అలవాట్లకు దుర్బలుడై కట్టుబడడు. అతనికి సర్వమున్ను ఈశ్వరానందమే.

పరమ విజ్ఞాన సృష్టిలో ధనశక్తిని ఈశ్వర శక్తికి తిరిగి వశము చేయవలసి ఉన్నది. జగన్మాత తన సృజన దృష్టిలో నిర్ణయించిన ప్రకారమే నూతనములున్ను, దివ్యముగా చేయబడ్డవిన్ని అయిన ప్రాణ, స్థూల జీవితములను సత్యసుందర సుసంబద్ధ జీవితముగా సిద్ధపరచి స్థాపించడమునకు ధనశక్తిని వినియోగించవలెను. కాని మొట్టమొదట దానిని ఆమె కొరకు తిరిగి జయించవలసి యున్నది. స్వభావమునందు స్థైర్యము గలవారై, విశాల హృదయులై, అహంకార రహితులై, హక్కు, మినహాయింపు సందేహము, లేకుండా ఆత్మార్పణము చేసుకొన్నవారే ఇట్టి విజయము సాధించడమునకు మిక్కిలి సమర్థులు. విశుద్ధులు, సమర్థులు అగు అట్టివారిద్వారానే పరాశక్తి ప్రవహిస్తుంది.

5. ఐక్యానుభూతి

ఈశ్వర కార్యములను చేయవలెనని నీకు నిజముగా కుతూహలముంటే ఆశను అహంకారమును నీవు పూర్తిగా వదలివేయవలెను. నీ జీవితమంతా పరమేశ్వరునకు అర్పించవలెను. పరమేశ్వరుని కొరకు నీ జీవితమునంతా యజ్ఞము చేయవలెను. నీవు చేసే కర్మకు ఒక్కటే ఉద్దేశ్యము ఉండవలెను. అదేమంటే ఈశ్వర శక్తికి పరిచర్య చేయడము. ఆమె అజ్ఞను గ్రహించడము, ఆమె కార్యము, నెరవేర్చడము, ఆమె కార్యముయందు నీవు ప్రత్యక్షసాధనము కావడము. నీ ఇచ్ఛకూ, ఆమె ఇచ్ఛకూ భేదమేమీ ఉండరాదు. నీలో ఆమె ప్రేరణవినా ఏ సంకల్పమున్నూ కలుగరాదు. నీలోను, నీద్వారాను ఆమె తెలిసి చేసే కర్మలు తప్ప యితరవేమిన్ని ఉండరాదు. ఈస్థితిని పొందేవరకు ఈశ్వర చైతన్యములో నీవు అభివృద్ధి చెందవలయును.

ఇట్టి తీవ్రమయిన సంపూర్ణమగు అభేదభావము పొందడమునకు నీకు శక్తి కల్గేవరకున్ను, నీవు ఆమె సేవకొరకు సృజింపబడ్డ జీవుడవుగాను శరీరముగాను ఆమె కొరకే సమస్తమూ చేసేవాడవుగాను నిన్ను నీవు యెంచుకో వలసి ఉంటుంది. ప్రత్యేకముగా నేనే కర్తను అనే భావము నీలో ప్రబలముగా ఉన్నప్పటికిన్ని, కర్మ చేసేది నేనేనని నీవనుకొంటూ ఉన్నప్పటికిన్ని-యీ కర్మ ఆమెకొరకే నీవు చేయవలసి ఉంటుంది. అహంకారముతో కూడుకొన్న నీ కోరికల ఒత్తిడి అంతా, స్వలాభము కొరకైన దేవులాట అంతా, స్వార్థము యొక్క లాభాలాభ నిర్ణయమంతా, నీ స్వభావము నుండి బహిష్కరించవలెను. ఫలాపేక్ష ఉండరాదు. జగన్మాత ప్రీతి, కార్యసిద్ధీ - ఇవే నీ ఫలము. దివ్య చైతన్యమందు స్థిరాభివృద్ధీ, ప్రశాంతీ, బలమూ ఆనందమూ ఇవే - నీ లాభము. సేవ వలన కల్గే ఆనందమూ, కర్మల ద్వారా పొందే ఆత్మాభివృద్ధివల్ల కల్గే ఆనందమూ, మాత్రమే స్వార్థ రహితుడైన కర్మికి తగిన ప్రతిఫలం.

నీవు ఆమె సాధనమే కాని కర్తవు గావని అంతకంతకు ఎక్కువగా అనుకొనే ఒక సమయము తటస్థిస్తుంది. ఎందువల్లనంటే మొట్టమొదట నీ భక్త్యతిశయము వల్ల జగన్మాతకూ నీకూ గాఢ పరిచయము కలుగును. తత్పరిచయ ప్రభావమున నీవు ప్రతీమారూ బుద్ధిని ఏకాగ్రము మాత్రము చేసి సర్వమున్ను ఆమె హస్తగతము

చేసినట్లయితే చాలును. నీకు ప్రకృతమున ఆమె మార్గదర్శకత్వమూ, ఆమె స్వయముగా చేసే ఆజ్ఞా, లేదా ప్రోత్సాహమూ, కర్తవ్య కార్య నిర్దేశమూ, తన్నిర్వహణవిధమూ, తత్ఫలమూ కలుగును. పిమ్మట ఈశ్వరశక్తి నిన్ను ప్రోత్సహించి, నీకు మార్గదర్శిగా ఉండడమే కాకుండా, నీవు చేయవలసిన కార్యములను ఆమెయే ఉపక్రమించి, నిర్వహించి, నిర్వహిస్తున్నది అనే సంగతి నీవు గుర్తింతువు. నీ వ్యాపారములన్నీ ఆమె మూలముననే ప్రభవించుచున్న వనిన్నీ, నీ శక్తులన్నీ ఆమెవే అనిన్నీ, నీవు గుర్తింతువు, మనస్సు, ప్రాణము, శరీరము ఆమె కార్యమునకు పనికివచ్చే తెలివిగల యింపైన సాధనములనిన్ని, ఆమె క్రీడాసాధనములనిన్ని, ఈ స్థూల జగత్తులో ఆమె లీలలు విశదీకరించుట కేర్పడిన ఉపాధులనిన్నీ నీవు గుర్తింతువు. ఇటువంటి ఐక్యభావము, ప్రాధేయతకన్న యెక్కువ సౌఖ్య స్థితి ఉండబోదు. ఎందువల్లనంటే ఇట్లు చేయుటచేత కష్టములు బాధలుగల అజ్ఞాన జీవితమును దాటుదువు. దాని నుండి నీ ఆధ్యాత్మ జీవితము యొక్క యాధార్థ్యమును నీవు గ్రహింతువు. దాని యందలి గాఢ ప్రశాంతీ, నిరతిశ ఆనందమును నీవు పొందుదువు.

జగన్మాతతో పూర్తిగా నీవు ఐక్యముజెంది, వేరొక ప్రత్యేక వ్యక్తివనిగాని సాధనముననిగాని, సేవకుడవనిగాని, కర్తవనిగాని నీవు యెంతమాత్రమూ అనుకోకుండా జగన్మాత బిడ్డవని, ఆమెచైతన్యము యొక్కయు నిత్యాంశమని నీవు అనుకోవడమే ఈ పరిపూర్ణత్వమందలితుది అవస్థ. ఎల్లప్పుడూ ఆమె నీలోను నీవామెలోను ఉండగలరు. నీ ఆలోచన, పరిశీలన, క్రియ, నీ ఉచ్ఛ్వాస నిశ్వాసములు, నీ చలనమూ ఆమెనుండివస్తవనీ ఆమెవీ అనీ నీ సరళ సహజ స్థిరానుభవమై ఉంటుంది. ఆమె నుండియే, ఆమెచే నిర్మించబడ్డ ఒక వ్యక్తి వనీ, శక్తివనీ, క్రీడార్థము ఆమెనుండి వెలువరింపబడినప్పటికీ ఆమెలో ఎప్పుడూ సురక్షితముగా నుందువనీ, ఆమె సత్తులో సత్తువు, ఆమె చిత్తులో చిత్తువు, ఆమెశక్తిలో శక్తివి, ఆమె ఆనందములో ఆనందమవు అయి నీవుందువనీ నీవు తెలిసికోగలవు, చూడగలవు, అనుభవించగలవు. ఇట్టి స్థితి సంపూర్ణముగా కల్గినప్పుడు ఆమె విజ్ఞాన శక్తులు నిన్ను సునాయాసముగా కదపగల్గి నప్పుడు నీవు ఈశ్వరకార్యములను అతులితముగ జేయగల్గుదువు. జ్ఞానము, ఇచ్ఛాశక్తి, కర్మ ఇవి సందేహ రహితమగును, ధారాళమగును, తేజోవంతమగును. సహజమగును, దోషరహితమగును. ఈశ్వరుని నుంచి బహిర్గతమై ప్రవహించును. అనంతుని దివ్యగతి యగును.

6. జగన్మాత అవతారములు

జగన్మాత నాల్గు శక్తులున్నూ, తమ విశేష మూర్తులలో నాలుగు మూర్తులు. అవి ఆమె అంశలు. వానితో ఆమె దివ్యత్వము మూర్తీభవించినది. ఈ మూర్తులద్వారా, ఆమె తన ప్రాణికోటిని పరిపాలించును, లోకములందలి సృష్టిజాలమును శాసించును, క్రమపరుచును, ఆమె సహస్రశక్తులు ఎట్లు ప్రవర్తించవలెనో, నిర్దేశించును. ఎందువల్లనంటే, జగన్మాత ఏకరూపిణి అయినప్పటికి, భిన్న భిన్న స్వరూపములతో మనకు గోచరించును. విశ్వమునందు ఆమె కార్యము నెరవేర్చే ఆమె శక్తులు, మూర్తులు అనేకము. విభూతులు, ఆవిర్భావములు అనేకము. జగన్మాత అని మనము ఏ ఒక్కరిని పూజింతుమో ఆమె చిత్ శక్తియే ఆమెయే సృష్టినంతా పరిపాలిస్తున్నది. ఆమె ఏకము అయినను పలువిధమగుటచేత,ఎటువంటి సూక్ష్మబుద్ధికిన్నీ, స్వతంత్రమైన గొప్పవివేకమునకున్నూ ఆమె వ్యాపారములను తెలుసుకోవడము దుర్లభము, ఈశ్వరుని చిత్‌శక్తే జగన్మాత. ఆమె తన సృష్టియంతటికి అతీతురాలై యున్నది. ఆమె మూర్తులద్వారా, ఆమె వైఖరులు కొంత మట్టుకు చూడవచ్చును. అనుభవించవచ్చును. తన జీవరాసుల కొరకై ఆమె పొందుటకు సమ్మతించిన దేవతా రూపములలో విస్పష్టము, పరిచ్ఛిన్నము అగు గుణ క్రియలు ఉండుటచేత ఆమె వైఖరులు బాగా గ్రహించవచ్చును.

జగన్మాత మూడు విధములగు భావములను పొందియుండును. మనలనూ, జగత్తునూ భరించు చిత్ శక్తితో ఐక్యానుభూతిని చెందినప్పుడు అవి నీవు తెలుసుకోగలవు.

1. పరమేశ్వరి (ఆదిపరాశక్తి)యై, లోకాతీతురాలై, పరమేశ్వరుని నిత్యనిగూఢ రహస్యముతో సృష్టికి సంయోగము కలుగజేయుచున్నది.

2. భువనేశ్వరి (మహాశక్తి)యై, ఈ జీవరాసులన్నింటిని సృజించి, లక్షలాది కార్యములకు, శక్తులకు తానాధారమైయుండి వాటిలో తాను ప్రవేశించి వాటిని పోషించి, నడిపించును.

3. జీవేశ్వరియై, పైనిచెప్పిన తన రెండు అఖండ స్వరూపములశక్తిని తనలో మూర్తీభవింపచేసుకొనును. వాటిని మన సమీపమునందు ఉండేటట్లు చేయును. మానవునకూ, దివ్య స్వభావమునకూ మధ్యస్థముగా నుండి పనిచేయును.

పరమేశ్వరి:

ఆది శక్తి, పరాశక్తి, పరమేశ్వరి అగు జగన్మాత లోకాతీతురాలై ఉండి, తన నిత్యచైతన్యములో పరమేశ్వరుని వహించుచుండును.

పరమశక్తికిని, వాచామగోచర స్వరూపమునకును ఆమె ప్రత్యేకముగా ఆశ్రయమిచ్చుచున్నది. వెల్లడిచేయవలసిన తత్వములను తన యందుంచుకొని లేదా పైనుండి ఆహ్వానించి, అవి దాగియుండు పరమ రహస్యము నుండి తన అనంత చైతన్య ప్రకాశములోనికి తీసికొనివచ్చి తన సర్వశక్తిలోను, అఖండ జీవనములోను వాటికి ఒక శక్తిరూపమునిచ్చి యీ ప్రపంచములో ఒక దేహమును ప్రసాదించును.

లోకములందు ఆమెద్వారా 'ఈశ్వరశక్తి' అనే ద్వైతాద్వైత చైతన్యముగాను, 'పురుష-ప్రకృతి' అనే ద్వైతభావముగాను, పరమేశ్వరుడువెలసియుండుటచేతనున్ను, లోకములలో, చేతన భూమికలలోను దేవతలుగాను, వారి శక్తులుగాను ఆమె వల్ల పరమేశ్వరుడు రూపమెత్తుటచేతనున్నూ గోచరమగు లోకములలోను అగోచరములగు లోకములలోను ఉన్నది సర్వము పరమేశ్వరుడు అగుటచేతనున్నూ- నిత్య సచ్చిదానందరూపమున పరమేశ్వరుడామెయందే ఎప్పటికిని వెలసి యుండును. సర్వమును పరమేశ్వరునితో ఆమె అడు ఆటయే- సర్వము నిత్యుని రహస్యములను, అనంతుని అద్భుతములను ఆమె ప్రత్యక్షపరచుటయే, సర్వము ఆమెయే. ఎందువల్లనంటే సర్వము దివ్యచిత్ శక్తియొక్క అంశమే కాబట్టి, పరమేశ్వరునాజ్ఞచేత, ఆమె నిర్ణయించినట్లు తప్ప ఏదియున్ను ఇక్కడగాని ఎక్కడగాని ఉండవీలులేదు. ఈశ్వర ప్రేరణచేత తాను చూచి తన కల్పితానందములో ఉద్భవింపజేసిన దానికి తప్ప మరి దేనికీ ఆకారము పొందవీలులేదు.

మహాశక్తి (భువనేశ్వరి) :

జగజ్జననియగు మహాశక్తి తన ఉత్కృష్టమగు చైతన్యముచేత ఈశ్వరుని నుండి అమె పొందినదంతా ఆచరణలో పెట్టుచు, తానుసృజించిన లోకములలోనికి ప్రవేశించును. అమె సన్నిధియందు వాటికి దివ్యోత్సాహమున్నూ, సర్వపోషకమగు దివ్యశక్తిన్నీ, ఆనందమున్నూ కలుగును. ఇవి లేనిదే అవి ఉండనేలేవు. మనము ప్రకృతి అనేది ఆమె యొక్క మిక్కిలి బహిరంగమైన క్రియాభావమే. ఆమె తన శక్తులను ప్రక్రియలను సామరస్యముతో నుండునట్లు నిర్ణయించును. ప్రకృతి కార్యములు ఆమె ప్రేరేపణవల్లనే జరుగును. చూడదగ్గవి, అనుభవించదగ్గవి, జీవించదగ్గవి అగు అన్నింటియందు రహస్యముగా గాని, బహిరంగముగా గాని పరిభ్రమించడము ఆమెయే. ప్రతిలోకమున్నూ తన్మండలము యొక్క మహాశక్తి ఆడు ఒక ఆట; లేదా బ్రహ్మాండముల యొక్క మహాశక్తి భువనేశ్వరి ఆడు ఒక ఆటయే. విశ్వాత్మగాను పరమేశ్వరి మొక్క మూర్తి గాను ఆ మహాశక్తి అక్కడ ఉండును. ప్రతీలోకమున్ను నిజ దివ్యదృష్టిలో ఆమె చూచినదియే; శక్తి సౌందర్యోపేతమగు ఆమె హృదయము సంగ్రహించినదియే; ఆమె ఆనందములో సృజింపబడినదే.

దివ్యలోకములు:

కాని ఆమె సృష్టి పెక్కుభూమికలలో జరుగుతున్నది; దివ్యశక్తి అనేక శ్రేణులలో వ్యక్తమగుచున్నది. అన్నమయ ప్రాణమయ లోకములు మనుష్యులవి. వీటి శిఖరమున అనంత సత్, చిత్,శక్తి, ఆనందలోకమున్నవి. అచ్చట జగన్మాత వ్యక్త నిత్య శక్తిగా ఉండును. అక్కడ ప్రాణికోటి వాచామగోచరమగు పరి పూర్ణత్వములోను, వికారం చెందని ఏకత్వములోను జీవనము జరుపును. ఎందువల్లనంటే ఆమె చేతులలో వారిని ఎప్పుడు భద్రముగా కాపాడును. మనకు మిక్కిలి సమీపములో సంపూర్ణమగు విజ్ఞాన సృష్టియొక్క లోకములున్నవి. వాటిలో జగన్మాత పరమ విజ్ఞాన మహాశక్తిగా ఉన్నది. ఆమె సర్వజ్ఞుని ఇచ్ఛాశక్తిగానూ సర్వశక్తి యుతుని జ్ఞానశక్తిగాను ఉన్నది. అమోఘమగు కార్యములందు ఆమెశక్తి ఎప్పుడూ గోచరమగును. ప్రతీ ప్రక్రియా స్వయముగా పరిపూర్ణావస్థ జెందుటచేతనూ, ఆమె శక్తి గోచరమగను. అచ్చటి సకల వ్యాపారములు సత్యమునకు కొనిపోవు సోపానములే. అక్కడి సకలజీవులు,

దివ్యజ్యోతి యొక్క చైతన్యములూ, శక్తులూ, దేహములున్నూ; అక్కడి అన్ని అనుభవములూ నిబిడమైన సంపూర్ణానందముయొక్క సముద్రములు, వరదలు, తరంగములున్నూ.

అజ్ఞాన లోకములు:

కాని మనము నివసించే యిక్కడ అజ్ఞాన లోకములున్నవి. అవి మనోమయ, ప్రాణమయ, అన్నమయలోకములు. అవి తమ ఉత్పత్తి స్థానమునుండి చైతన్యమున వేరుబడినవి. ఈ భూలోకమే వాటి ప్రధానమైన కేంద్ర స్థానము. దీని పరిణామము అతికఠిన కార్యము. తామసము, ప్రయాస, లోపములతో కూడుకొన్న దీనినికూడ జగజ్జనని భరించుచున్నది. మహాశక్తి చేతనే ప్రేరేపింపబడి, రహస్య లక్ష్యమునకు యిది కూడా తీసికొనిపోబడుచున్నది.

అజ్ఞాన భూయిష్ఠమగు యీమూడు లోకములకు మహాశక్తియై జగన్మాత ఉన్నది. ఈలోకమునకు ఆహ్వానించవలసిన విజ్ఞానజ్యోతి, నిత్యజీవనము, సత్యసృష్టి-వీటికిన్ని, ఆరోహణ అవరోహణములతో గూడిన చైత్యభూమికల సమూహములకున్ని, మధ్య సంస్తరమున ఆమె నిలిచియున్నది.

ఈ చైతన్య భూమికలు జంటనిచ్చెనవలె అవరోహణ క్రమమున జడపదార్థము యొక్క అవిద్యలోనికి పడిపోవును; మరిన్ని, ప్రాణము, జీవము, మనస్సు వికసించుటచేత, మరల అనంతాత్మయొక్క ఉన్నతికి ఆరోహించును. తాను చూచిన దానినిబట్టిన్నీ యీ విశ్వమునందు భూపరిణామమునందు ఉండవలసినదంతయున్నూ, నిర్ణయించుకొని ఆమె దేవతలందరికన్న పైని ఉన్నత స్థానమాక్రమించుకొనియున్నది. ఈ పని కొనసాగించుటకై ఆమె శక్తులు, మూర్తులు ఆమె సమక్షమున ఉంచబడ్డవి; వాటినుండి వచ్చు ఆవిర్భావములను ఈ అధోలోకములకు ఆమెపంపును. ఈ అధోలోకములను అవి కలగజేసుకొని పరిపాలించును. యుద్ధముచేసి జయించును; వీటి యుగములను నడిపించి, మార్చును; వీటి శక్తులను వ్యష్టిగాను సమిష్టిగాను నడిపించును. యుగ యుగంబులందు భిన్ననామములతో మానవులు ఆమెను పూజించిన అనేక దివ్యరూపములు దివ్యమూర్తులున్ను యీ ఆవిర్భావములే. ఈశ్వర విభూతులకు మనస్సులు దేహములు నిర్మించి నిరూపించినట్లే యీ శక్తుల ద్వారా వాటి ఆవిర్భావముల ద్వారా తన విభూతుల ద్వారా తన విభూతులయొక్క మనస్సులను,

దేహములను నిర్మించి, నిరూపించుచున్నది. తనశక్తి తన గుణము తన సాన్నిధ్యము వీటిలో కొంత అంశను మానవ చైతన్యమనే వేషముతో యీ స్థూల ప్రపంచమున ప్రకాశింపజేయుటకై అమె యిట్లు ప్రవర్తిస్తున్నది. విశ్వదేవతలు సహాయకారులుగాను, తానే అవ్యక్తనటిగాను, అమె యేర్పాటుచేసి, ఆడించే నాటకము వలెనే యీభూలోక లీలలున్నవి,

పై నుండి సర్వమున్ను జగన్మాత పరిపాలించడమేకాదు; అమె యీ క్రింది మూడు అధోలోకములకు గూడ అవతరించును. ఇక్కడి సర్వవస్తువులున్నూ అవిద్యాప్రవృత్తులు సైతము నిరాకారమైన అవ్యక్తాధికారమందున్న అమెయే; సూక్ష్మాకృతిలో అమె సృష్టియే; అమె ప్రకృతి దేహమే; అమె ప్రకృతి శక్తియే, అవి అట్లు ఎందుకున్నవంటే-గూఢమైన ఈశ్వరాజ్ఞచేత ప్రేరేపింపబడి, అనంత కాలములో నిర్వహింప వలసిన ఒక కార్యసిద్ధి కొరకు అమె యీగొప్ప యజ్ఞమునకు సమ్మతించి, అజ్ఞానముయొక్క జీవ, రూపములను వ్యాజముగా ధరించుటచేతనే.

ఇదిగాక స్వయముగా కూడ జగన్మాత తమస్సులోనికి అవతరించినది దానిని జ్యోతిలోనికి తీసుకొని పోవుటకు; అసత్య భ్రాంతులలోనికి అవతరించినది-దానిని సత్యమొనర్చుటకు; మృత్యువులోనికి అవతరించినది-దానిని అమర జీవనముగా మార్చుటకు; నిరంతరచింతాక్రాంతమగు సంసారక్లేశములోనికి అవతరించినది- తుదకు దానిని స్వీయ పరమానందపారవశ్యములోనికి మార్చివేయుటకే. తన బిడ్డలపై మహత్తరమైన, గాఢమైన ప్రేమ జగన్మాతకున్నదికాబట్టే యిట్టి అజ్ఞాన వేషమును ధరించడమునకు అమె సమ్మతించినది. అసత్యాజ్ఞానశక్తుల దూషణవ్యధలను సహించుటకు ఒడబడినది. మృత్యువగు జన్మద్వారముల నుండి పోవుటకు సహించినది. ప్రపంచమునందలి దుఃఖములు, ఆవేదనములు, బాధలు తనపై వేసుకొని అనుభవిస్తున్నది. ఇట్లు చేయడమునకు కారణము దానిని జ్యోతి, ఆనందము, సత్యము, అమరత్వమునకు ఉద్ధరించవచ్చుననియే. పురుషయజ్ఞమని చెప్పబడే మహాయజ్ఞము యిదే. దీర్ఘముగా అలోచించిన యిదియే ప్రకృతి యొక్క సంపూర్ణహోమము, జగన్మాత మహాత్యాగము.

విశ్వమును నడిపించేటప్పుడూ, జగల్లీలను నిర్వహించేటప్పుడూ జగన్మాత శక్తులలోను మూర్తులలోను ప్రధానమైన నాల్గు అంశలు విశదమగుచున్నవి.

అందొకటి ప్రశాంత వ్యాపకత్వముతోను, అఖండ జ్ఞానముతోను, శాంత దయాళుత్వముతోను, అపరిమిత కారుణ్యముతోను, అప్రతిమాన మాహాత్మ్యము తోను, సార్వభౌమత్వముతోను కూడినమూర్తి.

ఇంకొక్కటి ఘనసత్త్వము, అప్రతిహతోద్రేకము, వీరభావము, ఆకీర్ణేచ్ఛ, ప్రచండవేగము, లోకముల నుగ్రరూతలూగించగలశక్తి- ఇవిగల శక్తి రూపము.

మూడవది విశదమగు, మధురమగు, అద్భుతమూర్తి; సౌందర్యము, సామరస్యము, ఇంపైన సమగతి, వీటిమొక్క గాఢరహస్యముతోను, నానావిధాపూర్వ సూక్ష్మసంపదలతోను, అనివార్యాకర్షణముతోను మోహనశృంగారముతోను ఆ మూర్తి తేజరిల్లుచున్నది.

జగన్మాత గాఢసంపూర్ణ శక్తితోను, శ్రద్ధావంతము దోషరహితము అగు కార్యముతోను, ప్రతి విషయమందును నిరాడంబరమగు, సరియైన సంపూర్ణత్వము తోనూ నాల్గవ మూర్తి కూడియున్నది.

జ్ఞానము, సత్త్వము, సామరస్యము, సంపూర్ణత్వము-ఇవియే ఆ మూర్తుల వేరువేరు గుణములు. ఈ శక్తులనే అవి తమతోగూడా ప్రపంచములోనికి తీసుకొనివచ్చి మానవ వేషము ధరించి తమ విభూతులలో ఈ శక్తులను వెల్లడిచేయుచున్నవి. జగన్మాత ప్రత్యక్ష ప్రభావమునకు తమ జడస్వభావమును వికసింప చేసుకొన గలవారిలో, వారి వారి ఆధ్యాత్మికాభివృద్ధి ననుసరించి యీ శక్తుల నామె స్థాపించును. ఈ నాల్గు శక్తులను మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అనే దివ్యనామముల పేర్కొందుము.

మహేశ్వరి

రాజేశ్వరియగు మహేశ్వరి బుద్ధి, ఇచ్ఛాశక్తులపై వ్యాపించును. వైశాల్యమునందు అధివసించి, వాటిని జ్ఞానముగాను, బృహత్తుగాను మార్చి ఉన్నతము చేయును; లేదా వాటి కందని శోభయందు ముంచెత్తెను. విజ్ఞానముయొక్క అనంతత్వమునూ, విశ్వవిశాలత్వమునూ, పరంజ్యోతి వైభవమునూ, అద్భుత జ్ఞాననిక్షేపమునూ జగన్మాత నిత్యశక్తుల అపరిమిత వ్యాపారమునూ మన బుద్ధికి తెలియజేసేది మహాజ్ఞాన స్వరూపిణియగు మహేశ్వరియే. చల్లనితల్లి ఆ మహేశ్వరి పూజ్యురాలైనప్పటికిని ఆయమ శాంతాద్భుతములు ఆమె యందు నెలకొనియున్నవి.

జ్ఞానమంతా ఆమెయందే కాపురముండుటచేత ఆమెను చలింపచేసేదేదియును లేదు. ఆమె తెలిసికోనెంచినదేదిన్నీ గూఢముగానుండదు- అన్ని వస్తువుల గురించిన్ని సమస్త జీవులను గురించిన్నీ ఆమెకు తెలుసును. వారి స్వభావము, ప్రవృత్తి ఆమె గ్రహించును. ప్రపంచ శాసనము, దాని కాలములు, ఆమెకు వేద్యమే. సమస్తము ఎట్లుండేదో, ఎట్లున్నదో, ఎట్లుండవలెనో, ఆమెకు విశదమే. సమస్తమును ప్రతిఘటించి, స్వాధీనము చేసుకొనే సామర్థ్యము ఆమెలోఉన్నది. ఆమె సూక్ష్మవివేకమున్నూ, ప్రశాంత సత్త్వమున్నూ అజేయము. సమానత్వము, ఓర్పు, స్థిర సంకల్పముతో వారివారి స్వభావానుసారంగా ఆమె మానవులతో వ్యవహరించును. వాటి శక్తి, వాటియందలి యాథార్థ్యమునుబట్టి వస్తువులతోను, సంఘటనములతోను ఆమె వ్యవహరించును. ఆమెకు పక్షపాతములేదు. కాని ఆమె ఈశ్వరాజ్ఞలననుసరించి కొందరిని ఉద్ధరించును. మరికొందరిని క్రిందికి పడదోయును లేదా తమస్సులో దిగవిడుచును. జ్ఞానము కలవారికి ఆమె యింకా అధికమున్నూ ప్రకాశవంతమున్నూ అగు జ్ఞానమును దయచేయును. దీర్ఘదర్శులు తనతో సంప్రతించుటకు ఆమె అంగీకరించును. విరోధమువల్ల కలిగే ఫలములను విరోధులు అనుభవించునట్లు ఆమె విధించును. శూన్యులను, మూఢులను వారివారి అజ్ఞానము ననుసరించియే ఆమె నడిపించును. ప్రతి మనుష్యుని హృదయమునందునూ మారు పల్కుచూ, అతని స్వభావమునందలి వేరువేరు భాగములను, వాటి అవసరమును, వాంఛను బట్టిన్ని, అవికోరు ప్రతిఫలమును బట్టిన్ని, ఆమె స్వీకరించి నడిపించును. వాటికి అవసరమైన ఒత్తిడిని కలుగజేయును; లేదా అజ్ఞాన ప్రవృత్తులలో ప్రవృద్ధమగుటకో నశించుటకో తమకున్న అమూల్య స్వాతంత్ర్యమును తామనుభవించుటకు వారిని వదలివేయును. ఎందువల్లనంటే ఆమె సర్వమునకు అతీతురాలు, దేనివల్లనూ కట్టుపడదు. జగత్తులో దేనితోను ఆమెకు అభిస్నేహములేదు. అయినప్పటికీ, అందరికంటే ఎక్కువగా జగజ్జననికుండు హృదయ మామెకు కలదు. ఎందువల్లనంటే ఆమె కరుణ అనంతము, అపరిమితము. ఆమె కళ్ళకు అందరు- అసురులు, రాక్షసులు, పిశాచులు సైతము, విరోధికూటముసైతము-ఆమె బిడ్డలే, అద్వితీయైక వస్తుభాగములే. ఆమె యిప్పుడు తిరస్కరించడం ఎప్పుడో అనుగ్రహించడం కోసమే. ఆమె శిక్షించడము అనుగ్రహించడమే. కాని, ఆమె కారుణ్యము ఆమె వివేకమును మరుగుపరచదు; జరగవలసిన విధానము నుండి ఆమె కార్యమును త్రిప్పదు. ఎందువల్లనంటే, సర్వపదార్థములందలి సత్యమే ఆమెకు ముఖ్యముగా కావలసినది.

జ్ఞానమే ఆమె శక్తికి కేంద్రము, మన ఆత్మను, మన స్వభావమును ఆధ్యాత్మిక సత్యముగా నిర్మించుటయే ఆమె కర్తవ్యమున్ను ప్రయత్నమున్ను.

మహాకాళి

మహాకాళి వేరొక స్వభావము కలది. ఆమె విశేషశక్తి, వ్యాపకత్వముగాదు-ఔన్నత్యము, జ్ఞానముగాదు - జవసత్త్వములు; ఆమె యందు ఆకీర్ణమగు తీవ్రత, కార్యసిద్ధిని బడసే ప్రబలశక్త్యుద్రేకము, ప్రతిహద్దును, అడ్డంకిని విచ్ఛిన్నం చేయడముకు దుమికే దివ్యవేగము గలవు. ఆమె దివ్యత్వమంతా ప్రచండ కార్యమహత్వముగా ప్రజ్వలించును. ప్రచండవేగమున కామె పెట్టినది పేరు; తత్ క్షణమే ఫలించు ప్రక్రియ ఆమె సొమ్ము; నిర్వక్రతీవ్రసంఘాతము ఆమెపని; ఎదురుగా పోయి డీకొని, పూర్ణవిజయము నొందడమే ఆమె కార్యము. అసురునకామె ముఖము భీతావహము. ఈశ్వరద్వేషులపట్ల ఆమె వృత్తి క్రౌర్యముతోను, అపాయముతోను కూడియున్నది; ఎందువల్లనంటే ఆమె ఎంతమాత్రము యుద్ధము నుండి వెనుదీయని లోకైక వీరమాత- అసంపూర్ణత్వము నామె సహించలేదు కాబట్టి మానవుని అవిధేయతను ఆమె కఠినముగా శిక్షించును. గాఢమగు అజ్ఞానముపట్ల ఆమె ఉగ్రభావము వహించును. ద్రోహము, అసత్యము, విద్వేషములపై ఆమె ఆగ్రహము తత్క్షణజనితము, భయంకరము. వైరభావము నామె మూలమట్టుగా ధ్వంసము చేయును. భగవత్ కార్యవిషయమున నిర్లక్ష్యభావమును, అశ్రద్ధను, సోమరితనమును ఆమె యెంతమాత్రమూ సహించలేదు. అవసరమైనపట్ల అకాలనిద్రాసక్తుని, కాలయాపనము చేయువానిని తీవ్రబాధ కలిగించి మేల్కొనేటట్లు శిక్షించును. తీవ్రము, సరళము, నిష్కపటము అయిన చిత్తస్పందనములు, ధారాళము, నిరంకుశము అయిన వ్యాపారములు, ప్రజ్వలించు ఆకాంక్ష. ఇవి మహాకాళి చలనమువలననే కలుగుచున్నవి. ఆమె ఆవేశము రౌద్రాత్మకము. ఆమె దృష్టిన్ని ఇచ్ఛయున్ను గరుడోత్పతనమువలె అత్యున్నతమున్ను. దూరగతమున్ను; ఆమె దివ్య చరణములు ఊర్ధ్వమార్గమున సవేగమైయున్నవి. ఆమె దివ్యహస్తములు శిక్షించడముకు రక్షించడముకు సిద్ధముగా చాచిఉన్నవి. ఎందువల్లనంటే ఆమెకూడ తల్లియే. ఆమె ఆగ్రహము ఎంత తీవ్రమో ప్రేమయు అంత తీవ్రమే. ఆమె దయ గాఢమున్ను. అతిరిక్తమున్ను. నిజబలముతో ఆమెను కలుగజేసికొనిచ్చినట్లయితే ఒక్క క్షణములో ఉపాసకుని ముట్టడించు శత్రువులను, ప్రతిఘటించు విఘ్నములను

దూదివలె ఎగురగొట్టగలదు. ఆమె ఆగ్రహము శత్రువులపట్ల భీతావహమున్ను, దుర్బలుల పట్లా భీరువులపట్లా ఆమె తీవ్రమయిన ఒత్తిడి బాధాకరమున్ను అయిఉన్నప్పటికీ, గొప్పవారున్ను బలవంతులున్ను, పూజ్యులున్ను ఆమెను ప్రేమించి ఆరాధిస్తున్నారు. ఎందువల్లనంటే వారి స్వభావములో తిరుగుబాటుచేసే లక్షణములను కొట్టి, బలముగాను, పూర్ణసత్యముగాను, ఆమె మార్చుననిన్నీ వారిలోని వక్రత్వమునూ కుటిలత్వమునూ కొట్టి సారళ్యమామె కలిగించుననిన్నీ వారిలోని అపవిత్రతను లోపములను ఆమె బహిష్కరించుననిన్ని వారు తలంతురు. ఆమె వల్లనే కాకపోయినట్లయితే ఒక్కరోజులో జరిగినపని శతాబ్దములకాలము పట్టియుండేది. ఆమె లేకపోతే అనందము విశాలముగాను, గంభీరముగాను ఉండవచ్చును; లేదా కోమలముగాను, మధురముగాను, సుందరముగాను ఉండవచ్చును. కాని పూర్ణోద్రేకయుక్తమగు ఉన్మాదోల్లాసము ఉండదు. జ్ఞానమునకు ఆమె విజయశక్తి యిచ్చును, సౌందర్యమునకును సామరస్యమునకును ఉన్నతగతిని కూర్చును; పూర్ణత్వము కోసమై మందము, కఠినము అయిన పరిశ్రమ, బలాభివృద్ధితో శీఘ్రముగా సిద్ధిపొందుటకు ప్రోత్సాహ మామె కల్గించును. పరమానంద పారవశ్యము, అత్యున్నత శిఖరములు, మహోన్నత లక్ష్యములు, విశాలతర శ్రేణులు వీటికి కొరతపడేదేమియూ ఆమెకు నచ్చదు. అందువల్లనే ఈశ్వరుని విజయశక్తి ఆమెవద్దనే ఉన్నది. తీవ్రత, ఉగ్రత్వము, ఉద్వేగము గల ఆమె అనుగ్రహము చేతనే, ఎప్పుడో ఎందుకు, యిప్పుడే మహత్కార్యసిద్ధి కలుగగలదు.

మహాలక్ష్మి

జ్ఞానము, సత్త్వము మాత్రమే జగన్మాత లీలల్లు కావు; ఆమెస్వభావమందు ఇంతకన్న సూక్ష్మమైన రహస్యమొకటి ఉన్నది. అది లేకపోయినట్లయితే, జ్ఞానము సత్త్వము అసంపూర్తిగానుండును. అది లేకుంటే, పూర్ణత్వము పరిపూర్ణముగా ఉండదు. జ్ఞాన సత్త్వములను మించి, నిత్యసౌందర్యమనే అద్భుతము కద్దు;దివ్యసామరస్యముల దుర్ గ్రాహ్యరహస్యము కద్దు; అప్రతిహతమగు జగన్మోహనత్వము అనే ఇంద్రజాలము కద్దు; ఈ జగన్మోహనత్వమే వస్తువులను, శక్తులను, జీవులను ఆకర్షించి పట్టుకొని ఐక్యమొందునట్లు చేయును. తెరమరుగునుండి అవ్యక్తానందము నటించుటకున్ను వాటిని తన సమగతులుగాను, రూపములుగాను చేయుటకున్నూ. ఇది మహాలక్ష్మి శక్తి. శరీరధారుల హృదయములను ఇంతకన్న యెక్కువగా ఆకర్షించు దివ్యశక్తి

(జగన్మాత)యొక్కమూర్తి ఇంకొక్కటిలేదు. లోకస్వభావముయొక్క అల్పత్వము కారణముగా మహేశ్వరి సమీపించడమునకుగాని, పొందడమునకుగాని వీలులేదు. ఆమె అంత శాంతముగాను, గొప్పగాను, దూరముగాను కనిపించవచ్చును. లోకస్వభావముయొక్క దుర్బలత్వము కారణముగా మహాకాళిని సహించుటకు వీలులేదు. ఆమె అంత వేగముతోను, మహాభయంకరముగాను కనిపించవచ్చును. కాని అందరున్నూ సంతోషముతోను ప్రేమతోను మహాలక్ష్మిని ఆశ్రయింతురు. ఎందువల్లనంటే ఉన్మత్త మధురమగు దివ్యాకర్షణము నామె వారిపై ప్రయోగించును. ఆమె సాన్నిధ్యమే పరమసౌఖ్యము. హృదయమం దామె ననుభవించడము జీవితమునకు అద్భుతానంద పారవశ్యము కలిగించడమే, మార్తాండమండలమునుండి తేజస్సు ప్రవహించునట్లే లావణ్యము, జగన్మోహనత్వము, మంజులత్వము ఆమెనుండి జాలువారును. అద్భుతావహమగు ఆమె కటాక్షము ఎచ్చటికి ప్రసరించునో ఆమె సురుచిర మందహాసము ఎచ్చోట సౌందర్యమును వర్షించునో, అచ్చోట జీవుడు వశీకృతుడై, స్వాతంత్ర్యరహితుడై అగాధమగు పరమానందరాశిని ఓలలాడును. ఆమె దివ్యహస్తస్పర్శ అయస్కాంత సన్నిభము. ఆమె హస్తముల గూఢమగు సున్నితమగు ప్రభావమువల్ల మనస్సు, ప్రాణము, దేహము, నిష్కల్మషమగును. ఆమె దివ్యపాదము లూనిన తావుల నుండి, పారవశ్యజనకమగు పరమానందము వింతవాగులై ప్రవహించును.

ఐనప్పటికి ఈ మోహనశక్తి కోరే నియమములు నెరవేర్చడము సులభ సాధ్యముకాదు. ఆమె సుప్రసన్నత్వమును నిలువుకోవడము కూడ సులభ సాధ్యముకాదు. జీవునకున్నూ మనస్సుకున్నూ సామరస్యమున్నూ అందమున్నూ; ఆలోచనలకున్నూ, భావములకున్నూ సామరస్యమున్నూ అందమున్నూ; ప్రతి బాహ్యచర్యకున్ను, ప్రవృత్తికిన్ని సామరస్యమున్నూ; జీవితమునకున్ను, పరిసరముల కున్ను సామరస్యమున్నూ అందమున్నూ-ఇవే మహాలక్ష్మి కోరేనియమములు. నిగూఢభువనానందముయొక్క సమగతులతో (RHYTHMS) ఎక్కడ సంబంధమున్నదో, జగన్మోహనాహ్వానమున కెచ్చోట ప్రత్యుత్తరము వినబడునో, అనుకూలత్వము, ఐకమత్యము, ఈశ్వరాభిముఖమై పెక్కు జీవుల సుఖాతిశయములతో ప్రవహించడము ఎచ్చోట కలదో, అట్టి వాతావరణమునందు ఆమె నివసించుటకు సమ్మతించును. కాని కురూపము, కుటిలము, క్షుద్రముగా ఉన్నవన్నియున్నూ; దారిద్ర్యము, నైచ్యము,

కశ్మలముతో నున్నవన్నియున్ను; క్రౌర్యము, మోటుతనముతో నున్నవన్నియున్నూ ఆమె గమనమును ప్రతిఘటించును. ఎక్కడ ప్రేమయు, సౌందర్యమును జన్మించలేదో, జన్మించనిష్టపడవో, అక్కడికి ఆమెరాదు; ఎచ్చోట క్షుద్రవస్తు సమ్మిళితములై అవి వికారరూపము చెందుతవో, అచ్చట నుండి ఆమె చటాలున వెళ్ళిపోవును; లేదా తన భాగ్యములను కురిపించుటకు సమ్మతించదు. మానవ హృదయములందు ఆమె ఉండగా, స్వార్థపర్వతము, ద్వేషము, మత్సరము, ద్రోహచింతన, అసూయ, జగడము వీటిచే చుట్టుకోబడ్డట్లు ఆమె గ్రహించినా, ద్రోహము, దురాశ కృతఘ్నత ఇవి పవిత్రమగు సత్పాత్రలో కలిసి ఉన్నా, క్షుద్రమగు కామక్రోధాదులున్ను అపరిశుద్ధమగు వాంఛలున్ను భక్తిని మలినము చేస్తూఉన్నా అట్టి హృదయములలో దయారాశియు, సౌందర్యరాశియు అగు శ్రీ మన్మహాలక్ష్మి క్షణమాత్రమైన నిలువజాలదు. ఒక దివ్యజుగుప్సచే నావరింపబడి ఆమె వెనుకకు తగ్గును; ఎందువల్లనంటే, ఈలాగు ఉండవలెనని ఆమె పట్టుపట్టదు, శ్రమపడదు; లేదా అసహ్యమగు విషపూరితమగు యీ పైశాచవస్తువు నిరాకరించబడి అదృశ్యమగు వరకు, ఆమె తన ముఖము నాచ్ఛాదించుకొని నిరీక్షించియుండి, పిమ్మట నిజమంగళప్రభావమును తిరిగి స్థాపించును. వైరాగ్యలక్షణములగు దారిద్ర్య కర్కశత్వములు ఆమెకు సంతోషావహములుకావు. గంభీరహృద్భావములను అణచివేయుటయున్ను, జీవప్రాణ భాగముల సౌందర్యమును తీవ్రముగా నిగ్రహించుటయున్ను ఆమెకు ఇష్టము లేదు. ఎందువల్లనంటే, ప్రేమ సౌందర్యముల ద్వారానే, ఆమె మానవులను ఈశ్వరాధీనము చేయుచున్నది. ఆమె పరమ సృష్టిజాలములో, జీవితము దివ్యచిత్రకళయందలి అమూల్యచిత్రముగా పరిణమిస్తున్నది. జీవనమంతా దివ్యానందసంధాయకమగు గీతముగా పరిణమిస్తున్నది. భువనసంపదలెల్ల ఒక్కచోటికి కొనితేబడి, ఒక ఉత్కృష్టమైన ప్రతిష్ఠాపనమునకై వినియోగింపబడుచున్నవి; మిక్కిలి స్వల్పమగు సామాన్య వస్తువులు సమేతము ఆమె ఐక్యానుభూతివల్లను, ఆమె ఉత్సాహ విశేషమువల్లను, అద్భుతముగా ప్రకాశించుచున్నవి. హృదయములోనికి ఆమెను రానిస్తే, జ్ఞానమును అద్భుతోన్నత శిఖరములకు ఎక్కించి, సర్వజ్ఞానాతీతమైన పరమోత్సాహము యొక్క గూఢరహస్యములను దానికి వెల్లడిజేయును; ఈశ్వరుని ప్రబలాకర్షణముతో భక్తిని అనుసంధానము చేయును; బలమునకూ శక్తికీ సమగతిని నేర్పును; ఇది వాటి కార్యశక్తికి సామరస్యమును, నిదానమును కూర్చును. ఇది (సమగతి) పరిపూర్ణత్వమునకు చిరస్థాయిత్వమొసగు చెలువము ఘటించును.

మహాసరస్వతి

మహాసరస్వతి జగన్మాత క్రియాశక్తిన్ని, మూర్తీభవించిన ఆమె పరిపూర్ణత్వమున్నూ, క్రమపద్ధతిని, నలువురమ్మలలోనూ మహాసరస్వతి కడసారిది; కార్యనిర్వహణమునందు కడునిపుణురాలు; భౌతిక ప్రకృతి కామె మిగిలిన వారికంటే సమీపమందున్నది. విశ్వశక్తులు ప్రవర్తించే విశాలమార్గములను మహేశ్వరి నిర్మించును, మహాకాళి వాటి బలోద్వేగములనడిపించును; మహాలక్ష్మి వాటి సమగతులను, లయలను విశదీకరించును; మహాసరస్వతి అన్ననో వాటినికూర్చి, పొందికపరచి పని సాగించే విషయముల నాయకత్వము వహించును, వేరు వేరు విభాగముల సంబంధ విషయమునా శక్తులయొక్క సార్థకమగు సంయోగము విషయమునా ఖండితమగు ఫలసిద్ధుల విషయమునా ఆమె నాయకత్వము వహించును. ప్రతి వస్తువుకు సంబంధించిన శాస్త్రము, కౌశల్యము, పారిభాషికత్వము ఇవి మహాసరస్వతి యాజమాన్యము క్రిందనేయున్నవి. పారంగతుడు అగు పనివానికుండే నిశితమైన యధార్థ జ్ఞానమూ, సూక్ష్మబుద్ధీ, క్షమా స్వతస్సిద్ధజ్ఞానమూ, కుశలత్వమూ, వివేచనదృష్టీ - వీటిని ఆమె తన స్వభావములో ఎప్పుడు ఉంచుకొని, తన కిష్టమైన భక్తులకు ఈయగలదు. బలము కలిగియుండి, విసుగు చెందకుండా, జాగ్రత్తగా సమర్థతతో,- నిర్మాణమూ, సంధాయకత్వమూ, పాలకత్వమూ, సంకేతవిద్యానైపుణ్యమూ, శిల్పమూ, ప్రపంచ వర్గీకరణ కౌశల్యమూ- అనే కార్యములను జరిపిస్తూఉండుట ఈ శక్తే- మహాసరస్వతి; మనుష్య స్వభావమును మార్చి నూత్నముగా ఆమె నిర్మించుటకు పూనుకొన్నప్పుడు ఆమె చేసేపని శ్రమకరమై, సూక్ష్మవిషయములను సైతము గ్రహించునదై యుండును; తొందరపడే మనకు మెల్లిగా చేస్తున్నట్లున్నూ, ఎప్పటికీ తరగనట్లున్నూ కనిపిస్తుంది. కాని నిజానికి, ఆమె ఎడతెగకుండా పట్టుదలతో, పూర్తిగా, దోషరహితముగా ఆ పనిచేస్తుంది. ఎందువల్లనంటే, నిజకార్యములలో ఆమె కనబరచు ఇచ్ఛాశక్తి సూక్ష్మవిషయములను సైతము వదలిపెట్టదు; ఆ శక్తికి విశ్రాంతిలేదు, నిరంతరము అలసట లేక పనిచేయును. మనపై వాలి ఆమె ప్రతి అల్పాంశమునూ గమనించి సవరించును; ప్రతి అల్పదోషమును, లోపమును, వక్రత్వమును, అసంపూర్తిని కనిపెట్టును; ఇదివరలో చేయబడ్డ సమస్తమున్ను, ఇంకాముందు చేయవలసిన దానిని సమస్తమున్ను ఆమె సరిగా ఆలోచించి, నిర్ణయించుకొనును. ఆమె దృష్టిలో స్వల్పవిషయమంటూ, నిరర్థక విషయమంటూ

లేదు. ఎంత అగోచరముగాను, ప్రచ్ఛన్నముగాను, గూఢముగాను ఉన్న వస్తువైనా ఆమె నుండి తప్పించుకోలేదు; ప్రతిభాగము నిజాకారము పొందే వరకున్నూ, సమస్తములో నిర్ణీత స్థానమున అది వుండి దాని వ్యాపారమునది నిర్వహించేవరకున్నూ, ఆమె మళ్ళీ మళ్ళీ సంస్కరిస్తూ ఎంతో ప్రయాసపడుతుంది. నిరంతరమూ, విసుగు విరామమూ లేకుండా, వస్తువులను, మళ్ళీ మళ్ళీ పరిష్కరించడములో, అవసరములేమో, వానిని పొందే విధమేదో, ఆమె ఏకకాలమున గ్రహించును; దేనిని అంగీకరించవచ్చునో, దేనిని నిరాకరించవలెనో తన స్వతస్సిద్ధజ్ఞానముచే తెలుసుకొనును. సరియైన సాధనమున్నూ, యుక్తమైనకాలమున్నూ, మేలైన పరిస్థితులున్నూ, నిజమైన విధానమున్నూ తన స్వతః సిద్ధ జ్ఞానముతో ఆమె జయప్రదముగా నిర్ణయించును. అజాగ్రత్త, ఉపేక్ష, సోమరితనము అంటే ఆమెకు రోత. మోసబుద్ధితోగాని, తొందరగాగాని కుయుక్తితోగాని చేసే పనులంటేనున్నూ. ఎడ్డితనము, ఉజ్జాయింపులు లక్ష్యభ్రష్టత్వము, కపటసమన్వయము, సాధన సామర్థ్యముల దుర్వినియోగములు, పనులు పూర్తిగా చేయకుండా వదలిపెట్టడము లేదా సగము సగము చెయ్యడము. అంటేన్నూ ఆవిడ కంటగించుకొనును. అవి ఆమె స్వభావమునకు విరుద్ధములు, ఆమెకార్యము సాంతమయ్యేసరికి, ఆమె మరిచిపోయినది ఏమీ ఉండదు; ఏ భాగమూ చోటుతప్పి ఉండడము గాని, లేకపోవడముగాని తప్పుస్థితిలో ఉండడముగాని సంభవించదు. సర్వమున్నూ సారవంతమై, సరియై, సంపూర్ణమై, స్తోత్రార్హమై ఉండును. దోషరహితమైన సంపూర్ణత్వము వినా ఇంక ఏదిన్ని ఆమెను సంతుష్టి పొందించదు సరిగదా నిజదృష్టికి సంపూర్ణత్వ మాపాదించడమునకు ఆమె అవసరమైనట్లయితే, అనంతమైన శ్రమను పొందడానికి కూడ సంసిద్ధురాలు, కనుకనే, జగన్మాత మూర్తులందరిలోను ఈమెయే సహస్రలోపములతో కూడుకొన్న మానవునితోబాటు, చిరబాధ ననుభవిస్తూ ఉంటుంది. ఆమె కరుణాశాలిని, చిరునవ్వుతో, సమీపమందే ఉండి, సహాయముచేస్తూ ఉండును; అంతలో విముఖత్వము నొందదు; నిరాశ చెందదు; అపజయములెన్ని కలిగినా, పట్టుదలతో పనిచేయును; మనము దృఢమైన ఇచ్ఛగలవారమై, సారళ్యము సద్భావము కలిగివుంటే అడుగు పెట్టినప్పుడెల్ల మన కామె హస్తము ఊతగా ఉండును; చపలచిత్తమును ఆమె సహింపదు. నటనలు కపటనాటక విద్య, ఆత్మవంచనము, మోసము, వీటిని ఆమె నిర్మోహమాటముగా విప్పి చెప్పి పరిహాసముపాలు చేయును. తల్లివలె మన కోరికలదీర్చును; స్నేహితునివలె ఆమె

మన కష్టములకు అడ్డుపడును. ఎప్పుడూ నిశ్చలమైన సలహాను ఇస్తూ, ఉపదేశము చేస్తూ ఉండును; మనోవ్యాకులత్వము, ఆగ్రహము, విచారము అనే మేఘములనామె స్వీయోజ్వల మందహాసముతో తరిమివేయును;నిత్యసన్నిహితమగు రక్షను జ్ఞప్తికిదెచ్చును; నిత్యజ్యోతిని నిర్దేశించును; ఇట్లా చేస్తూ భగవత్ స్వభావమునకు సంబంధించిన పరిపూర్ణత్వముకేసి మనలను తీసికొనిపోయే గాఢమైన, ఎడతెగని ప్రోత్సాహము కలిగించు పట్ల అమె నిశ్చలముగాను, ప్రశాంతముగాను, పట్టుదలగాను పని చేయును. మిగిలిన మూర్తుల కార్యసిద్ధి మహాసరస్వతిపై ఆధారపడి యున్నది. ఎందువల్లనంటే, ఆమెయే గట్టిపునాదిని వేయును. సూక్ష్మ విషయములను పరిష్కరించును. కట్టడమును నిర్మించి బిగించి స్థాపించును.

జగన్మాత ఇతరములగు మహత్తరమైన మూర్తులు ఇంకాఉన్నవి. కాని అవతరించడము అతికష్టముగా నుండెను. జగన్మాత పరిణామమునందు అవి అంత ప్రాముఖ్యముగా ముందు నిలబడలేదు. విజ్ఞానోపలబ్ధికి మిక్కిలి అవసరమైన సాక్షాన్మూర్తులు వారిలో ఉన్నవి. అందులో అతిముఖ్యమైనది ఒకటి గలదు. అదియే జగన్మాత యొక్క వింతయైన శక్తిమంతమగు, ఆదేశపూరితమగు ఆనందమూర్తి. ఈ ఆనందము ఉత్కృష్టమగు దివ్యప్రేమనుండి ప్రవహించును. విజ్ఞానతత్త్వముయొక్క అత్యున్నత శిఖరములకున్ను పాంచభౌతిక ద్రవ్యముయొక్క అఖాతములకున్నూ ఉండుకున్న తారతమ్యములను ఈ ఆనందమే నాశనము చేయుచున్నది.

ఆశ్చర్యకరమగు దివ్యతమ జీవనమునకు ఈ ఆనందమే మూలకారణమైయున్నది. ఇప్పుడుకూడా ఈ ఆనందమే నిగూఢముగానుండి జగత్తునందలి ఇతర శక్తులన్నింటియొక్క కార్యములకు ఆధారముగా ఉన్నది., కాని మానవ స్వభావము పరిమితము, అహంకారపూరితము. అజ్ఞానవిలసితము అగుటవల్ల, ఘనమగు నీ సాక్షాన్మూర్తులను గ్రహించుటకుగాని, వారి ప్రబలకార్యములను భరించుటకుగాని తగదు. పరివర్తనము చెందిన అన్నమయ, ప్రాణమయ, మనోమయ కోశములందు ఈనాల్గు శక్తులున్నూ (మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి). స్వేచ్ఛా సంచారమును, సామరస్యమును నెలకొల్పినప్పుడే, ఆ ఇతర అసామాన్యశక్తులు జగద్వ్యాపారమున వ్యక్తమగును; అప్పుడే విజ్ఞానకార్యము నిర్వహణమగును. ఎందువల్లనంటే, జగన్మాతయొక్క మూర్తులన్నియు ఆమెలో ఏకమై వ్యక్తమైనప్పుడు,

వారి వారి వేరు వేరు వ్యాపారములు సామరస్యముచెంది ఏకముఖమైనప్పుడు, ఆమెలో ఆ మూర్తులు విజ్ఞాన దివ్యత్వభావము పొందినప్పుడు- జగన్మాత అప్పుడే 'విజ్ఞాన మహాశక్తి' గా ప్రత్యక్షమై, తేజోవంతమగు పరమ మహత్వములను అనిర్వచనీయమగు ఆకాశమునుండి క్రిందికి క్రుమ్మరించును. అప్పుడు మానవ ప్రకృతి తీవ్రమగు భగవత్ స్వభావముగా మారగలదు. ఎందువల్ల నంటే, విజ్ఞాతసత్య-చైతన్యము, సత్య - శక్తి అనే ప్రధాన తంత్రులు మేళవింపబడగా, జీవవిపంచి అనంతగానము చేయడమునకు శ్రుతి ఏర్పడును.

ఇట్టి పరివర్తనము నీకు కావలిస్తే, దురాక్షేపణము, ప్రతిరోధము లేకుండ, జగన్మాత వశముకమ్ము. జగన్మాత శక్తులకు వశముకమ్ము. నిరాటంకముగా నీలో ఆమె కార్యమును నిర్వహించనిమ్ము. నీయందు మూడుగుణములుండవలెను. 1. చైతన్యము, 2. మృదుస్వభావము, 3. సంపూర్ణార్పణము. ఎందువల్లనంటే నీ మనస్సులో, నీజీవనములో, నీ హృదయములో, నీప్రాణములో, నీ దేహమందలి కణములలో సయితము, చైతన్యము కలిగి జగన్మాతను గురించి, ఆమె 'శక్తుల'ను గురించి, వారి వ్యాపారములను గురించి తెలిసికొనవలెను. ఎందువల్లనంటే, నీవు అజ్ఞానివైయున్నా నీకు ఎరుకలేని భాగములందు కాలములందూ ఆమె పనిచేయగలదు, చేస్తుంది; ఐనా నీవు పూర్తిగా జాగ్రదవస్థయందుండి ఆమెతో ఐక్యభావము చెంది ఉన్నప్పుడు ఉన్నట్లు మాత్రముండదు.

నీ స్వభావమంతా ఆమె స్పర్శకు మార్దవముగా నుండవలెను. అహంకార పూరితము, మూఢము, అగుమనస్సు, ప్రశ్నించునట్లూ, సంశయించునట్లు వాదించినట్లూ ప్రశ్నించకూడదు. మనస్సు (మనస్సు-మనోమయ పురుషుడు.) తన జ్ఞానాభివృద్ధికి, పరివర్తనకు శత్రువగును. నీవు అలాగున చేయకూడదు. మానవునియందలి ప్రాణము (ప్రాణము - ప్రాణమయ పురుషుడు) పట్టుపట్టినట్లున్నూ, ఈశ్వర ప్రభావమును తన మూర్ఖమగు రాగద్వేషములచేత అది ప్రతిఘటించినట్లున్నూ, సొంత వ్యాపారములే కావలెనని నీ స్వభావము పట్టుపట్టకూడదు. అసామర్థ్యము, మాంద్యము, తమస్సు- వీటి వెనుక ఒదిగిఉండి మానవుని స్థూలచైతన్యము (అన్నమయ పురుషుడు) జగన్మాతచేసే పరివర్తనమునకు ఆటంకములు కల్పించును. నీచమగు దుర్మార్గసుఖముల దగుల్కొని- తన తుచ్ఛమగు నిత్య చర్యలకున్నూ, శుద్ధమాంద్యమునకున్నూ, జడనిద్రకున్నూ భంగము కలిగించే ప్రతీస్పర్శను

ఎదిరించును. ఇట్లు నీ స్వభావము ఆమె చేసే పరివర్తనమునకు ఆటంకములు కల్పించకూడదు. నీవు నీ బహిరంతరాత్మలను సంపూర్ణార్పణము చేస్తే, నీ పూర్ణస్వభావము మృదువగును. పై నుండి ప్రవహించివచ్చే వివేక జ్ఞానములకూ, (మహేశ్వరి) శక్తికీ, (మహాకాళి) సామరస్య సౌందర్యములకూ, (మహాలక్ష్మి) పరి పూర్ణత్వమునకూ, (మహాసరస్వతి) నిరంతరము నిన్ను నీవు వికసింపచేసికొన్నందువల్ల నీలో అంతటా దివ్యచైతన్యము మేల్కొనును. ఆ చేతన శరీరము కూడా మేల్కొని సచేతనమగును. విజ్ఞాన దివ్యచైతన్య శక్తితో శరీర చైతన్యము ఐక్యముచేయును. పైని, క్రింద, చుట్టూర వ్యాపిస్తూఉన్న ఆమె శక్తులన్నింటిని శరీరము అనుభవించును, ఉత్కృష్టమైన ప్రేమానందములతో శరీరము పులకెత్తును.

కాని జాగ్రత్తగా ఉండు, నీచిన్న లౌకికబుద్ధితో జగన్మాతను అర్థము చేసుకోవలెనని, ఆమెను నిర్ణయించవలెనని ప్రయత్నించకు. ఎందువల్లనంటే, నీబుద్ధి దాని కతీతమగు విషయములను సైతము దాని స్వంత ప్రమాణములకున్నూ క్షుద్రహేతువులకున్నూ, దోషాభిప్రాయములకున్నూ, కలహశీలమగు గాఢ జ్ఞానమున కున్నూ నీచగర్వబుద్ధికిన్నీ, వశము చేయుటకు ఇష్టపడును, మిడిమిడి జ్ఞానముగల మానవబుద్ధి దివ్యశక్తియొక్క సర్వతోముఖ స్వాతంత్ర్యమును గ్రహించలేదు. ఎంత వేగముగా, ఎన్ని విధములుగా ఆమె చూచి, పనిచేయగలదో మానవబుద్ధికి గ్రహించనలవిగాదు; జగన్మాత చలనగతులు మానవబుద్ధి చలనగతులకు బిన్నములు, ఆమెయొక్క అనేక భిన్నమూర్తులు త్వరత్వరగా మారుటవల్లను, సమగతులను (RHYTHMS)కూర్చి, విభజించుటవల్లను, వేగమును వృద్ధిచేయుట, ఉప సంహరించుట వల్లను ఒకరి సమస్యకు భిన్నముగా వేరొక సమస్యను భిన్నరీతుల నామె పరిష్కరించుటవల్లను, ఒకమారు ఒక్క మార్గము ననుసరించి, దానిని త్యజించి, ఇంకొక్కమారు వేరొక్క మార్గము ననుసరించి త్యజించి , మరియు అన్నిటిని ఒక్కటిగా చేర్చుటవల్లను, దిగ్భ్రమచెందిన, మానవబుద్ధి- అజ్ఞాన గహనమును ఛేదించి ఈశ్వరశక్తి దివ్యజ్యోతికై ఉవ్వెత్తుగా పైకి లేస్తున్నప్పుడు ఈ శక్తి అభిప్రాయమును ఈ మానవబుద్ధి తెలుసుకోజాలదు. నీ ఆత్మను ఆమెకై వికసితము చేసుకోవడము మంచిది. నీచైత్య స్వభావముతో ఆమె ననుభవించి, చైత్యదృష్టి నామెను చూచి సంతృప్తిచెందుము. అట్లు చేయడము వల్లనే, నీకు సత్యస్వరూపము కనబడును. అప్పుడు జగన్మాత తనంతటతాను నీ మనస్సును. హృదయమును, ప్రాణమును, స్థూల చైతన్యమును

వాటియొక్క చైత్యాంశములచేత ప్రకాశవంతముచేసి, వాటికి కూడ తన పద్ధతులు, తన స్వభావమును వెల్లడిచేయును.

సర్వజ్ఞత్వమును గురించి, సర్వశక్తి మత్త్వమును గురించి, మనకు స్థూలమగు దురభిప్రాయములు ఉన్నవి. తదనుగుణముగా దివ్యశక్తి ఎప్పుడూ పనిచెయ్యవలెనని కోరే మూఢ మనస్సు యొక్క దోషమునుండి తప్పించుకో. మన మనస్సు ప్రతిమారు సిద్ధశక్తులు చూపించమని, సులభముగా కార్యసిద్ధి చెయ్యమని, మహత్తరమైన వైభవము చూపించమని కోరుచుండును. లేకపోతే ఈశ్వరుడున్నాడని నమ్మదు. అజ్ఞాన క్షేత్రములలోనికి దిగి అజ్ఞానమును ఛేదించుటకు జగన్మాత పూనుకొనుచున్నది. అజ్ఞాన భూమిలోనికి దిగి ఆమె ఉన్నదేగాని దానినుంచి ఇంకా పైకిరాలేదు. ఆమె తన జ్ఞానమును, శక్తిని సగము సగము మూసి, సగము సగము తెరచియుంచును. వాటిని తన సాధకులనుండి వ్యక్తులనుండి తరచుగా మరుగుజేయును. అన్వేషించు మనస్సుయొక్క పద్ధతిని ఆకాక్షించు హృదయము యొక్క పద్ధతిని, యుద్ధముచేయు ప్రాణము యొక్క పద్ధతిని, బంధింపబడి బాధపడుచున్న స్థూల ప్రకృతి యొక్క పద్ధతిని, ఆమె అనుసరించి పరివర్తనము చేస్తున్నది.

ఈశ్వరేచ్ఛచేత విధించబడిన నియమములున్నవి. ఎన్నో చిక్కులు పడ్డ ముడులు ఉన్నవి. నెమ్మదిగా చిక్కులు విప్పవలెనుగాని ఒక్క మారుగా కోసివేయడానికి వీలులేదు. పరిణమించుచున్న ఈ ఐహిక ప్రకృతి అసుర రాక్షస వశమైయున్నది; చిరకాలముగా వారు జయించి ఏలు ప్రదేశములోనే, వారి షరతుల ననుసరించియే వారిని ప్రతిఘటించి, జయించవలసియున్నది. మనలోని మానవత్వము దాని కట్టుబాట్లను దాటునట్లు మార్గమును చూపించి తయారు చేయవలెను. అది చాల దుర్బలమున్నూ, అజ్ఞమున్నూ అగుటచేత, ఒక్కమారు దాని కతీతమైన రూపమును అది పొందుటకు తగదు. దివ్య చైతన్యమూ శక్తీ ప్రతి నిముషమూ ఆవశ్యకమైన పనులనన్నింటిని చేయుటకు సిద్ధముగానున్నవి. ఎట్లు జరగవలెనని నియమింపబడి ఉంటుందో, తదనుగుణముగా ప్రవర్తిస్తవి. అసంపూర్ణత మధ్యను, కానున్న సంపూర్ణత్వమునకు రూపు పెట్టుచుండును. కాని నీలోనికి విజ్ఞానము అవతరించినప్పుడే సాక్షాత్ విజ్ఞానశక్తిగా దివ్యజ్ఞాన స్వభావములతో ఆమె పని జరిగించును. నీ మనస్సును నీవు అనుసరించినట్లయితే, జగన్మాత నీ ముందర ప్రత్యక్షమయినప్పటికి,

నీవామెను గుర్తించలేవు. సత్యమునకు అనుగుణముగా ఉండే నీ ఆత్మను నీవు అనుసరించు, పై మెరుగులు చూచి భ్రమపడే మనస్సును కాదు. పరాశక్తిని నమ్ముకో. అప్పుడామె నీలోని దివ్యాంశలను విడుదలజేసి సర్వమును దివ్యప్రకృతియొక్క రూపముగా మార్చును.

స్థూల చైతన్య పరిణామములో విజ్ఞాన పరివర్తనము తప్పకుండా జరిగితీరుతుంది. ఎందువల్లనంటే దాని ఊర్ధ్వగమనము అంతముకాలేదు. మనస్సే దాని చివర శిఖరముకాదు. ఐతే అట్టి పరివర్తనము సిద్ధించి, రూపము పొంది, శాశ్వతముగా నిలుచుటకు క్రింద నుంచి పిలుపు అవసరము జ్ఞానము ప్రవేశించగా దానిని నిషేధించక గుర్తించగల దృఢ సంకల్పముతో గూడిన పిలుపు అవసరము. మరిన్ని పై నుండి కటాక్షించు ఈశ్వరాజ్ఞ అవసరము. ఇట్టి అజ్ఞకు, అట్టి పిలుపుకు, మధ్యస్థురాలై ఉన్న శక్తి జగన్మాత ప్రత్యక్షశక్తే. మానవ ప్రయత్నమూ, తపస్సూ, చెయ్యలేని పనికూడా జగన్మాత చేస్తున్నది. అదేమంటే ఉదంచనమును ఛేదించి, యవనికను తొలగించి, పాత్రమును సంస్కరించి, అజ్ఞానము, అసత్యము, మృత్యువు, దుఃఖము - వీటితో నిండిన ఈ లోకములోనికి జ్ఞానమునూ, సత్యమునూ, దివ్యజీవనమునూ, అమరానందమునూ, తీసికొని రాగలిగినది జగన్మాత శక్తే.

(THE SEVEN PLANES OF CONSCIENCES)

	తత్త్వము	లోకము	కోశము
1.	సత్	సత్యలోకము	
2.	చిత్	తపోలోకము	ఆనందమయకోశము
3.	ఆనంద	జనలోకము	
4.	విజ్ఞాన	మహర్లోకము	విజ్ఞానమయకోశము
5.	మనస్సు	స్వర్లోకము	మనోమయకోశము
6.	ప్రాణము	భువర్లోకము	ప్రాణమయకోశము
7.	అన్నము	భూలోకము	అన్నమయకోశము

అనుబంధము

జగన్మాత అంటే?

ఈ దివ్య గ్రంథము అన్ని భాషలలోనికి అనువదింపబడెను. రెండువేల సంవత్సరములవరకు ఆచరించినను తరుగనంతటి సందేశ సంపదను శ్రీవారు భూప్రజలందరకు "THE MOTHER" గ్రంథము ద్వారా అందించిరి. ఆతల్లి జగన్మాత మహిమ తెలిసికొనుటకు సామాన్యులకు సాధ్యము కాదు. మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి మరియూ ఇతర విభూతులన్నియు ఆ తల్లికి చెందినవే.

ఈ జగన్మాత యగు మన తల్లి, సర్వశక్తులను తనలో ఇముడ్చుకొని మనుష్య రూపము దాల్చి ప్రత్యేక అవతారమూర్తి అయి, నేడు ఆశ్రమసాధకులను, భక్తులను, యావత్ భారత దేశాన్ని, సర్వ ప్రపంచాన్ని, ఉద్ధరించుటకు కంకణము కట్టుకొని నిల్చియున్న పరాశక్తి ఈమెయే. ఇంతేగాక ఈ మానవజాతిని ఒక దివ్య జాతిగా మార్పుజేయసమకట్టి, శ్రీ అరవిందులవారు దర్శించిన అతీతమానస పరిణామమును ఈ భూమియందు పునాదిగా ఆశ్రమము స్థాపించినది ఈ మహాతల్లియే. వీరి దివ్యమూర్తులలీలలు అద్భుతములు.

శ్రీ మాతను గూర్చి శ్రీఅరవిందుని ప్రశ్నోత్తరములనుండి ఒకింత ఈ క్రింద తెలుపుచున్నాము.

ప్రశ్న : శ్రీమాత మానవవ్యక్తి మాత్రమే యనియు, కాని యిపుడు మాత్రమే దివ్య మాతృత్వమును తనలో మూర్తీభవింపజేసుకొనెననియు చాలమంది భావింపు చుందురు?

శ్రీ అరవిందుల ఉత్తరములు :

1. పరమాత్ముడు లీలామానుషవేషధారి. మానవులకు మానవ మార్గదర్శకుడుగా అతడా మార్గమున నడచుచుండును. ఇందులకై మానవుని వెలుపలిప్రకృతిని, స్వభావమును గూడ అతడు చేబూనును. ఐనను అతడుమాత్రము అప్పటికిని

భగవానుడుగా మిగిలియే మీరియే యుండును. ఇదంతయు నిట్లెందులకు? ఆకస్మికముగ మానవుడు, మహేశ్వరుడుగ మారుటకుగాదు. దివ్యచైతన్యము ఈశ్వరజ్ఞానము, క్రమముగ బెరుగుచు తననుదాను వెలువరించుకొనుటకుగా ఆ అభివ్యక్తీకరణము (వెల్లడించుకొనుట) ఇటుల జరుగును. కావున "శ్రీమాత" తుదకు పసిబిడ్డలో గూడ తనను దా ప్రతిష్ఠించుకొనియే యున్నను, ఆ మానవత్వమును అతిక్రమించియే, అతీతమై యట శ్రీమాత యుండియే యుండెను. కావున నీవు వచించిన ఆ "చాలమంది" పూనెడు భావము తప్పే యగును.

నేను "జగన్మాత" "THE MOTHER" యను గ్రంథమున మన యీ శ్రీమాతను గూర్చి సూచించితిని. కనుక పరతత్త్వనిర్గుణ బ్రహ్మమును, సమష్టి విశ్వరూప, సగుణ బ్రహ్మమును ఈ రెంటి శక్తులను తనలో మూర్తీభవింపజేసుకొనిన వ్యష్టి సగుణ బ్రహ్మశక్తి స్వరూపిణియే - దివ్యజననియే మన యీ మాత. తనకు మనపైగల ప్రబల ప్రగాఢప్రేమచే మన శ్రీమాత మనమధ్యయందు ఈ అంధకారములోనికి, యీ అసత్యములోనికి, యీ అపరాధములోనికి, యీ మరణములోనికి అవతరణము (దిగుట) ఒనరించినది. 17-8-1938.

2. ఉత్తరము : విశ్వమును, విశ్వధర్మ విధానమును సముద్ధరించుటకుగా ఆవిశ్వశక్తి సల్పువ్యవహారమే (పనియే) అయ్యది. ఆ విశ్వశక్తి కన్నను ఉన్నతమగు పరతత్త్వమునుండియే యింకను మహత్తర పరివర్తనము (మార్పు) ఉదయించును. ఆపరిపూర్ణ పరమానుగ్రహమును, కార్యరూపమున గొనివచ్చుటకు మాత్రమే శ్రీమాత మూర్తీభవించి యిందుండి ప్రవర్తించుట 13-8-1933.

3. ఉత్తరము : ఆమె యొక్క మూర్తీ భావమే ఈదేహధారణమే యొక సదవకాశము, ఈ స్థూల భౌతిక ప్రపంచ చైతన్యములోనికి - అతీతమానసశక్తి - విజ్ఞానశక్తి- అవతరించుటకైన అవరోహించుటకైన, ఆ సదవకాశము - ఆ అవరోహణము- ఆ అవతరణము - సాధ్యమగుటకై వలసిన మొదటి పరివర్తనమును ఈ స్థూల భౌతిక చైతన్యము బడయుటకుగూడను ఇది యొక సదవకాశము,

పిమ్మట ఆ అతిమానస విజ్ఞానము యింకింకను పరివర్తనమును గలిగించును. కాని సంపూర్తిగ యీ చైతన్యము విజ్ఞాన శక్తిగ పరివర్తితముగాదు, ఇప్పటి యీ మానవుడెట్లు మనోమయ పురుషుడుగ ప్రకాశించుచున్నాడో అట్లే అపుడాతడు అతీతమానస వ్యక్తిగ , ఆ పరమ విజ్ఞానశక్తి ప్రతినిధిగ ప్రకాశింపగలడు. అట్టి విజ్ఞానమయ పురుషులనదగు నొకనూతనజాతి యుత్పత్తినొందగలదు. 13-8-1933.

4. ఉత్తరము:- శ్రీమాత యవతరించుట యేలనన, విజ్ఞానమయ శక్తిని- అతీత మానసశక్తిని, క్రింది భూమికలలోనికి గొనివచ్చుటకై. ఆ అవతరణము- ఆ అవరోహణము మాత్రమే సంపూర్తియగునొక అభివ్యక్తీకరణమును ఇట సుసాధ్యమునొనరించును.

ఈ సమష్టి విశ్వమందును యీ వ్యష్టి జీవునందును, యీ సమష్టి వ్యష్టి రూపములకు అతీతమందును గూడ నొక పరమేశ్వర శక్తి గలదు. దివ్య శక్తిగ మన యీ మాత యీ అన్నిటికిని ప్రతినిధిగ నిట నిలచి యున్నది. కాని అమె ఈ దేహమందు పని యొనర్చుచున్నదెందులకు? ఇప్పటి యీ భౌతిక జగత్తున అభివ్యక్తము (వెల్లడి) గాని యొకానొక దానిని అవతరింప జేయుటకై దించి తీసుకొని వచ్చుటకై ఇందలి-ఈ భౌతిక జగమునందలి జీవిత విధానమును పరివర్తిత మొనర్చుటకై ఈవిధముగ నీవామెను- దివ్యశక్తిగ-ఇట్టి యీపని నొనర్చుటకైన దివ్యశక్తిగ- పరిగణింపవలెను. ఈ దేహమున నిపుడీమె యీ విధముగ గలదు. కాని అమెదగు ఆ అఖండ చైతన్యమునందు- ఆ పూర్ణ చైతన్య భావమునందు, ఆ భగవానుని తదితర సకల భావములతోడను గూడ-సకల విభూతుల తోడను గూడ శ్రీమాత ఐక్యమొనర్పబడుచున్నది. ఏక మనియే భావింపబడుచున్నది.

శ్రీమాతను మన స్థూల శరీరముతోడ సమీపించుట యందలి ప్రయోజనము కలదు, అనగా స్థూల శరీరమును ధరించిన మన మనఃప్రాణములు శ్రీమాత యొక్క సాకారశక్తి కడకు సమీపించుట యందలి ప్రయోజనము గలదన్నమాట. శ్రీమాత తనదు ప్రపంచలీలయందు- విశ్వకారణ విధానధర్మ శాసనమునే అనుసరించును. ఇక తనదు స్థూల శరీర సాకార వ్యవహారము నందున

మాత్రము మనకిది నిరంతర కరుణకైన యొక సదవకాశము. ఇందులకే యిచ్చట శ్రీమాతృదేవీ జగన్మాత సాకారమూర్తీభావము సంభవించుట. 12-8-1933.

శ్రీ అరవిందులు వేరొకచోట ఇట్లు విశదీకరించిరి : -

"ఎవరిని శ్రీమాత జగన్మాత యని మనము పూజించుచున్నామో, ఆమె కేవలము సకల భూతజాలమును అధిష్ఠించి నడుపుచున్నచిచ్ఛక్తియే; ఆమె ఒక్కతే అయ్యును బహుముఖములు కలది; ఆ బహుముఖత్వ మెట్టిదియన, ఎంతటి వేగవంతమయిన మనస్సుకైనను, ఎంతటి స్వచ్ఛందము, విశాలమునైన బుద్ధికైనను ఆమె గమనమును అనుసరింప గలుగుట అసాధ్యము. మానస- అతీతమానసములకు స్వర్ణవారధిని నిర్మించుటకే అత్యుత్తమశక్తి మనమధ్య శ్రీ మాతగా జన్మమెత్తెను". ఈలా అతీత మానస శక్తి మన శకమున దేహధారియగుట మన యదృష్టముకాక మరేమి?

శ్రీమాతను ఈలా జపించమని శ్రీ అరవిందులవారొసంగిన మంత్రరాజమిది. "ఓం ఆనందమయి-చైతన్యమయి-సత్యమయి పరమే".

శ్రీమాత ఒకప్పుడన్న రహస్యవచనం (1971,72-సంచికలో కాబోలు పడింది.) "ఈ ప్రపంచములో ఒక్క వ్యక్తి-పరివర్తనముచెందని ఒక్కవ్యక్తి ఉన్నంత వరకు నా పని పూర్తి కాదు." దివ్యమాతయే ఈవిధముగా దీక్ష వహించిరి.

దివ్యేచ్ఛ వ్యవహరించును; కాని బాహాటముకాదు. అట్లయిననది అద్భుతముల క్రింద చేర్చబడును. అంతే, దివ్యేచ్ఛనిత్యము వ్యవహరించుచునే యుండును. భగవానుని దివ్యేచ్ఛ బాహాటముగ వెల్లడి యగుననుట సరికాదు. ఎల్లప్పుడు వెల్లడికాదు. అట్లగుట అరుదుగా మాత్రమే. బాహాటమయిన అద్భుతముల క్రింద ప్రజ జమకట్టెదరు. అద్భుతములు క్షణికములు అవి లేవనికాదు. దాని హేతువు మాటలు సరిగ అర్థము చేసుకొన లేకపోవుటే.

ప్రఖ్యాత తంత్రోపాసకులు శ్రీ కపాలిశాస్త్రిగారు ఆధ్యాత్మిక సాధనను, తంత్రోపాసనను అకుంఠితమైన దీక్షతో నిర్వర్తించినారు. వారి అనుభవమును ఒక సందర్భమున ఇట్లు తెలిపిరి. " శ్రీమాత కేవలము మానవ మాత్రమైన మాతృ

స్వరూపముగా గాక, అంతరాంతరములో వెలుగు ఆత్మజ్యోతి స్వరూపిణిగా "ధవళకాంతిజ్యోతి" (THE FLAME OF WHITE LIGHT) గా భాసించినది. అనగా శ్రీమాత కేవలము మహాత్ములుగా పరిగణింపబడు విశిష్ట వ్యక్తుల కోవకు చెందినది గాక సాక్షాత్తు భౌతికరూపము వహించిన ఆదిశక్తి స్వరూపమే నన్నమాట".

"సావిత్రి"ని ప్రారంభించక పూర్వము శ్రీ అరవిందులు నాతో ఇలా అన్నారని శ్రీమాత తెలిపిరి. "నూతనమగు ఒక సాహస కృత్యమును జేపట్ట నేను ముందుకు నెట్టబడుచున్నాను; ముందు సంకోచించితిని గాని, ఇప్పుడు ప్రారంభించుటకు నిశ్చయించుకొంటిని అయినను నా సాహసమెంతవరకు ఫలించునో తెలియదు. నేను మీ సహాయము నిమిత్తము ప్రార్థించుచున్నాను".

దీనిపై శ్రీమాత ఈలా వ్యాఖ్యానించుతున్నారు. "శ్రీ అరవిందులు వారు పలికే విధానమే అది; దానిలో నమ్రతయు, దివ్యవినయమును నిండి యుండును. వారెప్పుడును తమ సామర్థ్యమును వక్కాణించి పలుకరు."

"సావిత్రి" గురించిన అంతటి ప్రశంస ఎవ్వరును ఏ పుస్తకమును గురించియు చేసి యుండరు. సత్యము యొక్క సర్వోన్నత ఉన్నతి నుండి స్వయముగా దిగి వచ్చిన గ్రంథమదియని శ్రీమాత ఉగ్గడించును. కావున వేదముల వలెనే అదియు అపౌరుషేయమని అనుకొనుటయే ఎక్కువ సమంజసము. శ్రీ అరవిందుడు ఋషి యనుకొనుటకు వారి 'సావిత్రి' ఒక ప్రబల నిదర్శనము.

ఇహ చైతన్యములోనికి అతి మానస శక్తిని శ్రీమాత 29-2-1956 వ తేదీన భువిపై అవరోహింపజేసిరి. ఈ రోజు చరిత్రలో (గోల్డెన్ డే) బంగారపు దినముగా నిర్ణయింపబడెను. అతి మానసచేతనాశక్తితేజస్సులు భువిపై బంగారపు వర్షముగా ప్రవహింపజేసిరి.

శ్రీమాత ఇట్లు ప్రసంగించిరి: "నేను ఫ్రాన్సులో లూనెల్ వద్ద ఉన్నాను. నా శరీరారోగ్యం బాగాలేదు. వాస్తవానికి కొంచెములో మరణాన్ని తప్పించుకొన్నాను. నాకు వచ్చింది నరముల వాపు. ఒక తోట ముందు పడక కుర్చీలో పరుండి ఉన్నాను. అప్పుడు కూడా ఆధ్యాత్మిక శక్తి నాలో పని చేస్తున్నట్లు నాకు తెలిసింది. ఈ వ్యాధి ఇట్లా ఉన్నప్పటికీ యోగ బలంతో చేసే ప్రయోగాలు చెయ్యగలుగుతూ

ఉన్నాను. ఈ శక్తి పని చేస్తున్నదో లేదో చూడ్డానికి వస్తువుల మీద, వ్యక్తుల మీద, పరిస్థితుల మీద కేంద్రీకరించేదాన్ని, మనః ప్రాణ రంగాలలో అది చాల బాగా పని చేసింది. అప్పుడు కార్య రంగాన్ని మరికొంత విస్తృతం చేశాను. ఫ్రాన్సు, అమెరికా మొదలైన దేశాలలో అనేక స్థలాలలో నా పని నేను చేసుకుపోగలిగేదాన్ని, నేనెవరి మీద పని చేస్తూ ఉండేదాన్నో వారి ముఖాలు స్పష్టంగా చూసేదాన్ని. తమంత తాముగా చేయలేని పనులు చేయగలిగేటట్లు వాళ్ళను చేసేదాన్ని, ఇవి మన వశంలో ఉంచుకొని చేసే ప్రయోగాలు. ఈ పని ఆపగలిగిందేదీ లేదని నాకు తెలుసు. నా శరీరం లేక పోయినా ఈ పని కొనసాగుతూనే ఉంటుంది. నన్ను ఎవరు పిలిచినా ఈ పని కొనసాగుతూనే ఉంటుంది. నన్ను ఎవరు పిలిచినా నేనక్కడ ఉండేదాన్నే"

శ్రీ అరవిందులు భానుదీప్తపథమును గురించి ఈ క్రింద విధముగా తెలిపిరి. "దిగులు అన్నది ఉంటే అది ప్రయాణంలో మోయవలసిన భీకర భారం అనక తప్పదు. బాధ, దుఃఖము, పెనుగులాట, నిస్సంతోషం తప్పనిసరి కాకపోయినా, మార్గంలో సహజంగా ఎదురు కావడం నేను బాగా ఎరుగుదును. కాని అదే తరచుగా తటస్థపడితే అది ఆటంకమే అని చెప్పాలి. అవి మార్గంలో సహాయకారులు కావు. కాని మానవ స్వభావంలోని తమస్సు వాటిని మీదికి పంపుతుంది. ఈ తమస్సులోనుండి తేజస్సులోనికి పోవడానికే మనము శ్రమ పడవలసి ఉంది. యోగంలో భానుదీప్తపథము ఒకటి ఉన్నదని శ్రీరామకృష్ణపరమహంసకు కూడా తెలుసు. ఈ మార్గమే శీఘ్రంగా తీసుకుపోతుందనీ, మెరుగైనదనీ ఆయన అన్నాడు.

నేను ఈ మర్గంలోనే వెళ్లానని గాని, కష్టములనుండి, బాధల నుండి, ప్రమాదముల నుండి వైదొలగి పోయానని గాని నేను చెప్పడం లేదు. వీటి అన్నింటి అనుభవమూ నాకు సంపూర్ణంగా ఉంది. ఈ అనుభవం శ్రీమాతకు ఇంతకంటే పది రెట్లు ఎక్కువ ఉంది. ఈ విధంగా ఎందుకు జరుగుతుందంటే నూతన మార్గాన్ని కనుగొనవలసిన వారందరికీ వీటి మీద విజయం సాధించవలసిన అవసరం ఉండడమే అని చెప్పాలి. మార్గ మధ్యలో ఏ సాధకునికి కలిగే కష్టమైనా ముందు మాకు కలిగినదే అయి ఉంటుంది. వీటిలో కొన్నింటికి వ్యతిరేకంగా వందల కొలది పర్యాయములు (ఇది కూడ తక్కువ చేసి చెప్పడమే) పోరాడితే తప్ప వాటిని

అతిక్రమించలేకపోయాము. సంపూర్ణ సమగ్రత్వం సిద్ధించేవరకూ తమకు నిలిచి ఉండే హక్కు ఉందని ఎప్పటికీ వీటిలో ఎన్నో ప్రతిఘటిస్తూనే ఉన్నాయి. ఇతరులకు వీటితో తప్పని సరి అవసరం ఉందన్న విషయం మేమెన్నడూ అంగీకరించలేదు. నిజానికి ఈ మార్గంలో వెళ్లే వాళ్లకు సుకరంగా ఉండాలని ఈ భారాన్ని మేము వహించాము. ఈ మార్గంలో కలిగి తీరవలసిన కష్టములు, ప్రమాదములు, బాధలు మొదలైనవన్నీ ఇతరులకు కాకుండా తనకే కలిగేటట్లు చేయవలసిందిగా శ్రీమాత ఒకప్పుడు దైవాన్ని ప్రార్థించడం కేవలం ఈ ఉద్దేశంతోనే. సంవత్సరాల తరబడి ప్రతిరోజు ఆమె ఎన్నో దారుణమైన క్లేశాలు అనుభవించిన పిమ్మట ఈ ప్రార్థన నెరవేరింది. ఆమె యందు సంపూర్ణమైన నిష్కపట విశ్వాసమున్న వారందరూ ఈ మార్గంలో వెళ్లగలుగుతున్నారు. ఇంతేకాదు; ఆమెమీద నమ్మకం ఉన్నవాళ్లు కూడా ఈ దారిలో వెళ్లడం పూర్వం కంటే సులభంగా ఉందంటున్నారు. మళ్లీ ఎప్పుడైనా కష్టంగా ఉన్నట్లనిపిస్తే అవిశ్వాసమో, తిరస్కారమో, అభిమానమో మరొక రకమైన అంధకారమో వారి నావేశించినప్పుడు అట్లా జరుగుతూంది. ఈ భానుదీప్త పథమన్నది కట్టుకథ మాత్రంకాదు.

ప్రాచీన కాలంలో యోగులూ, తత్త్వాన్వేషకులూ ప్రప్రథమంగా కోరుకొన్నది శాంతి. భగవత్సాక్షాత్కారానికి మొట్టమొదట నిశ్చలంగా, నీరవంగా ఉండే మనస్సు అవసరమని వారు స్పష్టం చేశారు. ఇటువంటి మనస్సు ఎప్పుడూ శాంతికి ఆకారంగా ఉంటుంది. హర్షపూరితమై, భానుదీప్తంగా ఉన్న హృదయం ఆనందాన్ని భరించడానికి తగినదిగా ఉంటుంది. ఆనందం గాని, దాని కోసమైన సన్నాహం గాని దైవసంయోగానికి ఆటంకమని ఎవ్వరనగలరు?

ఒక్కొక్క విషయం సాధించినప్పుడల్లా మనంచేసే పురోగమనం మనకు తెలిసేదిగా వుంటుంది. తరచుగా మనలోకొన్ని ఆటంకాలను అతిక్రమించడం ఎట్లాగో చూపించి (ఇక్కడ నీవొక విజయం సాధించాలి అని) అవి మనకు చెపుతున్నట్లుగా అనిపిస్తుంది. ఏమైనప్పటికీ, వ్యక్తిగతంగా అవసరం ఉంటే తప్ప ఈతమోమయ దుఃఖపూరిత మార్గంలో వెళ్లడానికి ఎవ్వరూ పూనుకోకూడదు.

శ్రీ అరవిందులొక జాబులో నిట్లు వ్రాసిరి “1947లో అతిమానస శక్తి భూమిపై అభివ్యక్తమగు కార్యక్రమమునందొక దశను చేరుకొనగలదు.” ఈ ప్రకారం మానవులలో మార్పు కొనసాగిన ఆయన జోస్యము వాస్తవము కాకుండునా?

దిII 4-5-1967న శ్రీతల్లిగారిలా తెలిపిరి: కొద్ది నెలలుగా మన ప్రజలలో జన్మించిన శిశువులలో చాల మట్టుకు ఒక ప్రత్యేక విధమైన వారుగా యున్నారు.

ఈ నూతనానుభవము త్వరితముగ సాగుచున్నది. అతి మానసలోక ద్రవ్య మీ భూమిపై ధారాళముగ చేరుటచే మానవులలో ఈ మార్పు త్వరితగతిని సాగుచున్నది.

పృథ్వి జీవితమును ఉత్తమ దైవము తాను కోరుకొనినదిగా యున్నది. ఆయన అనంత ఇచ్ఛ, దానిని అంధకారాగారము నుండి తన అద్భుత ధామము మరియు ఉత్తమ స్వర్గానందమునకు చేర్చు ఆలయముగ మార్చుటే.

(రచన : శ్రీ చక్కా సత్యనారాయణ 7.9.85)